RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 సంచిక 18 ఎడిటర్: జేరిపోతుల సంపత్, కరీంనగర్ బుధవారం 22-04-2026 పేజీలు: 8, వెల : 2.00

తెలంగాణ వాణి

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292



2వ పేజీలో...

డీల్ కుదరకపోతే..

## యుద్ధమే

### ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతల మధ్య అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్‌తో చర్చలు సఫలం కాకపోతే యుద్ధం తప్పదని, తాము ఇప్పటికే ఆయుధాలను సిద్ధం చేసుకున్నామని సంచలన వ్యాఖ్యలు చేశారు. శాంతి కోసం తాము ప్రతిపాదించే 'డీల్'ను అంగీకరించాలని, లేనిపక్షంలో వినాశకర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇరాన్‌తో డీల్ కుదరకపోతే మేము మరోసారి యుద్ధానికి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాం. గత కాల్పుల విరమణ సమయంలో మేము మా శక్తిని మరింతగా కూడగట్టుకున్నాం.



## తెలంగాణలో పెట్టుబడులకు అవకాశం

### నార్వే బృందందతో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్,ఏప్రిల్ 21 : తెలంగాణలో పెట్టుబడుల కోసం నార్వే కంపెనీలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం పలికారు. లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి వివరించారు. మంత్రి శ్రీధర్ బాబుతో నార్వే ప్రతినిధులు ఈరోజు మంగళవారం సచివాలయంలో భేటీ అయ్యారు. మే ఎలిన్ స్టెనర్ నేతృత్వంలో హై లెవల్ డెలిగేషన్ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రితో వారు చర్చించారు. 'తెలంగాణ-నార్వే' ద్వైపాక్షిక సహకారంపై కీలక చర్చలు జరిగాయి. పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రంలో అనుకూల విధానాలు ఉన్నాయని తెలిపారు. క్లీన్ ఎనర్జీ, గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగాల్లో భాగస్వామ్య అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఏఐ, లకైమేట్ టెక్, హెల్త్ టెక్ రంగాల్లో కలిసి పని చేసేందుకు రోడ్ మ్యాప్ సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. 'తెలంగాణ-నార్వే వర్కింగ్ గ్రూప్' ఏర్పాటు ప్రతిపాదనపై కూడా చర్చించారు. పెట్టుబడులకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి నార్వే సిద్ధమని రాయబారి వెల్లడించారు.





2వ పేజీలో...

## ఇరాన్‌కు చైనా సాయం

అమెరికా పట్టుకున్న నౌకతో

## గుట్టురట్టు?

- హర్మూజ్ జలసంధిలో ఇరాన్‌కు చెందిన నౌకను అడ్డగించిన అమెరికా
- షిప్‌లో క్షిపణుల కోసం రసాయనాలు ఉన్నాయని నిక్కీ హేలీ ఆరోపణ
- చైనా నుంచి వస్తున్న ఈ నౌక ఇరాన్‌కు చైనా సాయానికి నిదర్శనమన్న హేలీ
- అమెరికా చర్యను 'సాయుధ దోపిడీ'గా అభివర్ణించిన ఇరాన్



## అబద్దాలు చెప్పడంలో కేసీఆర్

## పదేళ్లలో అబద్దాలతోనే పాలన చేశారు

2వ పేజీలో...

- బిఆర్ఎస్‌లో ఇప్పుడు పంపకాల పంచాయితీ
- రబీ ధాన్యంసేకరణపై అధికారులతో కోమటిరెడ్డి సమీక్ష

నల్గొండ, ఏప్రిల్21 : అబద్దాలు చెప్పడంలో కేసీఆర్‌ను మించినోళ్లు లేరని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శలు చేశారు. కేసీఆర్ గతంలో దళితుడిని సీఎం చేస్తాం.. ఇంటికో ఉద్యోగం ఇస్తాం.. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి ఉన్న పదేండ్లలో హామీలు అమలు చేయలేదని విమర్శించారు. అబద్దాలు చెప్పి మోసం చేయడం కెసిఆర్ నైజం అని మంత్రి ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడో విచ్చిన్నమైందని.. ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీలో పంపకాల కోసం అధిపత్య పోరు జరుగుతుందన్నారు. ఫ్యామిలీ టెన్షన్స్‌తో కేసీఆర్ ఫ్రస్టేషన్లో ఉన్నారని.. అందుకే జగిత్యాల సభలో నోటికి వచ్చినట్లు మాట్లాడారని అన్నారు. కేసీఆర్ ఫస్ట్ ఆయన ఇల్లు చక్కదిద్దుకోవాలని ఆ తర్వాత పార్టీ పునర్నిర్మాణం గురించి ఆలోచించాలని సూచించారు. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ లీడర్ బీఆర్ఎస్ పార్టీలో చేరడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు. 2039 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. జగిత్యాలలో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. ఈ క్రమంలో కెసిఆర్ ప్రసంగంపై మంత్రి దుయ్యబట్టారు. తెల్లారితే కొందరు నా చావు కోరుకుంటున్నారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు.




2వ పేజీలో...

## ఏటిఎంలా మారిన కాళేశ్వరం ప్రాజెక్ట్

### రేవంత్ రాహువు, కేసీఆర్ కేతువు అంటూ బండి విమర్శలు

హైదరాబాద్, ఏప్రిల్21 : కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి మాట మార్చారని కేంద్ర మంత్రి బండి సం జయ్ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన స్కామ్ రూ.లక్ష కోట్లా? రూ. 9వేల కోట్లా? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంలో ఒక్కరిపై అయినా ప్రభుత్వం చర్యలు తీసుకుందా అని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ పై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రాహువు, కేసీఆర్ కేతువు అంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్, రేవంత్ భాషను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. గతంలో బీఆర్ఎస్‌కు.. ఇప్పుడు కాంగ్రెస్‌కు కాళేశ్వరం ఏటీఎంలా మారిందని కేంద్ర మంత్రి ఆరోపించారు.



## రేవంత్‌రెడ్డికి గవర్నర్ మద్దతు ఎంత..?

2వ పేజీలో...

హైదరాబాద్, ఏప్రిల్ 21,: తెలంగాణ మంత్రి అజరుద్దీన్ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంగంలోకి దిగారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అజారుద్దీన్ ఈ నెల 30 లోగా ఏదైనా చట్టసభలో సభ్యుడిగా ఎన్నిక కావాల్సివుంది. అలాకాని పక్షంలో ఆయన మంత్రి పదవి నుంచి తప్పుకోవాల్సివుంటుంది. దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకస్మికంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిశారు. మంత్రి అజారుద్దీన్ తోపాటు ప్రొఫెసర్ కోదండరామ్ ను ఎమ్మెల్సీగా నామినేట్ చేసిన ఫైల్ ను ఆమోదించాలని కోరారు. ప్రధానంగా మంత్రి అజారుద్దీన్ ను నామినేట్ చేసే అంశంపైనే సీఎం దృష్టిపెట్టారని చెబుతున్నారు.సాధారణంగా గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకంపై రాష్ట్ర ప్రభుత్వ సిఫార్సులను గవర్నర్ లు యథాతథంగా ఆమోదిస్తారు. కానీ, తెలంగాణలో రాజకీయ పరిస్థితుల కారణంగా ఇద్దరు ఎమ్మెల్సీల నియామకం పెండింగ్ లో పడిపోయినట్లు చెబుతున్నారు. మంత్రి అజారుద్దీన్ ను ఎమ్మెల్సీగా నామినేట్ చేస్తూ గత ఏడాది అక్టోబరు 28న తెలంగాణ మంత్రి మండలి తీర్మానం చేసింది. ఈ తీర్మానం ఆమోదించాల్సిందిగా గవర్నర్ కు సిఫార్సు చేసింది. ఇక ఆ నెల 31న అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేశారు. ప్రభుత్వం సిఫార్సు చేయడంతో అజారుద్దీన్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే ప్రభుత్వ సిఫార్సులను గవర్నర్ ఇంతవరకు ఆమోదించలేదు. అజారుద్దీన్ మంత్రిగా ఉన్న సమయంలో గవర్నర్ జిష్ణుదేవ్ ఉండగా, తర్వాత ఆయన బదిలీ అయ్యారు.



2వ పేజీలో...

## ఔను ..లాయర్లతో మాట్లాడడానికే ఢిల్లీ వెళ్లా

కెసిఆర్ స్థాయి ఏంటో ప్రజలకు తెలుసు

హుందాగా మాట్లాడడం నేర్చుకుంటే మంచిది

కురచ బుద్ది చాటుకున్న రేవంత్ రెడ్డి

హైదరాబాద్, : బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ సూచన మేరకే దిల్లీ వెళ్లి లాయర్లను కలిసినట్లు మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సీఎం పెట్టే అక్రమ కేసులను ఎదుర్కొనేందుకే అక్కడి లాయర్లతో మాట్లాడినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. కాళేశ్వరం కేసులపై సీనియర్ లాయర్లతో చర్చించేందుకు వెళ్లినట్లు చెప్పారు. ఓటుకు నోటు కేసు కూడా రేపు సుప్రీంకోర్టులో విచారణకు రానుంది. ఆ కేసు గురించి కూడా న్యాయవాదులతో చర్చించాం అన్నారు. ఈ కేసులో అప్పటి ముఖ్యమంత్రి, హోం మంత్రి కూడా ఇంప్లీడ్ అయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హోంశాఖ తరఫున అనామక లాయర్‌ను పెట్టారు. నిందితుల తరఫున పేరు మోసిన లాయర్ ముకుల్ రోహత్గీని పెట్టుకున్నారు.

# మత్తు పదార్థాలను నిరోధించాలి

## అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్



నిజామాబాద్ : మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం అదనపు కలెక్టర్ అధ్యక్షతన మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశం జరగ్గా సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలపై చర్చించి అవలంభించాల్సిన విధానాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు సామాజిక మాధ్యమాలతో పాటు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. కల్తీ కల్లు తయారీ కోసం వినియోగించే అల్ప్రాజోలంను కట్టడి చేసేందుకు గట్టి నిఘా ఉంచాలన్నారు. క్లోరోఫాం, డైజోఫాం, ఆల్ప్రాజోలం వంటి వాటిని వినియోగిస్తూ తయారు చేసిన కల్తీ కల్లు సేవిస్తుండడం వల్ల అనేక మంది అనారోగ్యాల బారిన పడుతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఎవరు కూడా కల్తీ కల్లు బారిన పడకుండా గ్రామగ్రామాన అవగాహన కల్పించాలని సూచించారు. నిరంతర దాడులు కొనసాగిస్తూనే, మత్తు పదార్థాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ వారిని చైతన్యపర్చాల్సిన అవసరం ఉందని అన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధక కమిటీలను బలోపేతం చేస్తూ పూర్తి స్థాయిలో అవి పని చేసేలా చూడాలని విద్యా శాఖ అధికారులకు సూచించారు. మత్తు పదార్థాల నిర్మూలన కోసం ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ అనేక చర్యలు చేపడుతోందని కలెక్టర్ గుర్తు చేశారు. ఎక్కడైనా గంజాయి, క్లోరల్ హైడ్రేట్, డైజోఫామ్, అల్ప్రాజోలం వంటి వాటి రవాణా, విక్రయాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే సంబంధిత శాఖల అధికారులకు సమాచారం అందించాలని, టోల్ ఫ్రీ నెంబర్ 1908 కు కూడా ఫోన్ చేసి సమాచారం తెలియజేయవచ్చని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అన్నారు. ఈ సమావేశంలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో నిజామాబాద్ జోన్ ఏసీపీ సోమనాథం, ఏసీపీ ప్రకాష్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, జిల్లా ఔషధ నియంత్రణ అధికారిణి శ్రీలత, డీఐఈఓ రవికుమార్, ఎం.వీ.ఐ శ్రీనివాస్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ భాస్కర్, సైకియాట్రిస్ట్ డాక్టర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# అబద్దాలు చెప్పడంలో కేసీఆర్

# పదేళ్లలో అబద్దాలతోనే పాలన చేశారు



నా చావు కోరుకుంటున్నారని కేసీఆర్ అనడం సరికాదని.. మేమెప్పుడు ఆయన చావుని కోరుకోలేదన్నారు. బీఆర్ఎస్ నాయకులే సీఎం రేవంత్ రెడ్డిని ఇష్టానురంగా ఏకవచనంతో మాట్లాడుతున్నారని.. జనం మార్పు కోరుకుని ప్రజా ప్రభుత్వాన్ని గెలిపిస్తే ఉక్రోషంతో ఊగిపోతున్నారని విమర్శించారు. పదేండ్లలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని.. చివరకు ఔటర్ రింగ్ రోడ్డుని కూడా అమ్మేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటి దీన స్థితిలోకి రాష్ట్రాన్ని నెట్టేసి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోవాలని జీవన్ రెడ్డి ఎందుకు

మొదటిపేజీ తరువాయి...

నినాదాలు చేశారు..? పేదలకు రేషన్ కార్డులు ఇచ్చినందుకా.. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నందుకా.. ఎందుకు రేవంత్ ప్రభుత్వం పోవాలని ప్రశ్నించారు. ఇకపోతే రబీ ధాన్యం సేకరణపై అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమీక్ష నిర్వహించారు. యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు పెంచాలని ఆదేశించారు. అన్ని కేంద్రాలకు అవసరమైన లారీలు ఇవ్వాలని.. రాత్రి, పగలు ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు పంపాలని పేర్కొన్నారు. ధాన్యం ఎక్కువ వచ్చే గ్రామాలకు ఎక్కువ లారీలు పంపాలి.

రోడ్లపై ధాన్యం పోయకుండా స్కూళ్లు, ఫంక్షన్ హాళ్ల వద్ద కేంద్రం పెట్టాలి. గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. కొత్త రేషన్ కార్డులు ఇచ్చి 3.78 కోట్ల మందికి సన్న బియ్యం ఇస్తున్నాం. కేసీఆర్, రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డితినే బియ్యమే పేదలకు పంపిణీ చేస్తున్నాం. పదేళ్లలో అప్పులు చేసి వెళ్లి.. ఒకేసారి బంగారు తెలంగాణ చేయాలంటే సాధ్యమేనా.. అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం నిల్వల విషయంలో రూ.11 వేల కోట్ల కుంభకోణం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కొంత మేర ధాన్యం రికవరీ చేయించాం. నల్గొండ జిల్లాలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయని మంత్రి తెలిపారు.

# ఇరాన్‌కు చైనా సాయం..

మొదటిపేజీ తరువాయి...

ఢిల్లీ,:అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. హర్మూజ్ జలసంధిలో అమెరికా విధించిన దిగ్బంధనాన్ని ఉల్లంఘించి ప్రయాణిస్తున్న ఇరాన్ నౌకను అమెరికా నౌకాదళం స్వాధీనం చేసుకుంది. అయితే, చైనా నుంచి వస్తున్న ఈ నౌకలో క్షిపణుల కోసం ఉద్దేశించిన రసాయన సామగ్రి ఉందని రిపబ్లికన్ పార్టీ నేత, భారత సంతతికి చెందిన నిక్కీ హేలీ సంచలన ఆరోపణలు చేశారు. "ఈ వారాంతంలో హర్మూజ్ జలసంధిలో అమెరికా పట్టుకున్న నౌక, చైనా నుంచి ఇరాన్‌కు వెళ్తోంది. ఇందులో క్షిపణుల కోసం రసాయన సామగ్రి ఉంది. ఆగమని పదేపదే హెచ్చరించినా అది ఆగలేదు" అని నిక్కీ హేలీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇరాన్ పాలనకు చైనా మద్దతిస్తోందన్న వాస్తవాన్ని ఇకపై విస్మరించలేమని ఆమె వ్యాఖ్యానించారు. అమెరికా దళాలు 'టౌస్కా' అనే ఇరాన్ జెండా ఉన్న కంటైనర్ షిప్‌ను గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో ఇరాన్‌కు చెందిన చాబహార్ పోర్ట్ సమీపంలో అదుపులోకి తీసుకున్నాయి. ఈ నౌక ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ షిప్పింగ్ లైన్స్ (ఐఆర్ఐఎస్ఎల్) సమూహానికి చెందింది. అమెరికా చర్యను 'సాయుధ దోపిడీ'గా ఇరాన్ అభివర్ణించింది. దిగ్బంధనాన్ని ఎత్తివేసే వరకు చర్చలకు హాజరుకాబోమని స్పష్టం చేసింది. మరోవైపు రాయిటర్స్ వార్తా సంస్థ ప్రకారం ఈ నౌకలో సైనిక, పౌర అవసరాలకు వాడే ద్వంద్వ వినియోగ వస్తువులు ఉండవచ్చని అమెరికా భద్రతా వర్గాలు ప్రాథమికంగా అంచనా వేస్తున్నాయి. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమానికి సహాయం చేస్తోందన్న ఆరోపణలతో అమెరికా ఇప్పటికే 2019లో ఐఆర్ఐఎస్ఎల్ సంస్థపై ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే.

# రేవంత్‌రెడ్డికి గవర్నర్ మద్దతు ఎంత

మొదటిపేజీ తరువాయి...

కొత్త గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా వచ్చారు. ఈ కారణంగా ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం నియామకం పెండింగులో ఉండిపోయినట్లు చెబుతున్నారు. అయితే ప్రొఫెసర్ కోదండరాంకు సంబంధించి న్యాయవివాదం ఉండటంతోనే గవర్నర్ ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నారని ప్రచారం జరుగుతోంది. దీంతో అజారుద్దీన్ పేరును సైతం ఆమోదిస్తారా? లేదా? అనే ఉత్కంఠ నెలకొంది. మరో పది రోజుల్లో గవర్నర్ ఆమోదం లభించకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి నుంచి తప్పుకోవాల్సివుంటుందని నిపుణులు చెబుతున్నారు. అదే జరిగితే ఈ పరిణామం రాజకీయంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి దెబ్బగా వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో ముందుజాగ్రత్త చర్యగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అయితే గవర్నర్ నిర్ణయమేంటో మాత్రం తెలియలేదు. దీంతో అజ్జూభాయ్ మంత్రి పదవిపై తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. గవర్నర్ కోటాలో శాసన మండలికి పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి పట్టుబడుతున్న వారిలో ప్రొఫెసర్ కోదండరాం.. సహా.. ప్రస్తుతం మంత్రిగా ఉన్న అజారుద్దీన్ ఉన్నారు. వీరిలో అజారుద్దీన్ పరిస్థితి అత్యంత ముఖ్యంగా మారింది. ఆయన ఇప్పటికే ఆరు మాసాలుగా మంత్రిగా ఉన్నారు. కానీ, ఏ సభలోనూ ఆయన ప్రాతినిధ్యం లేదు. ఈ నెల 30 లోటా అంటే.. కేవలం 11 రోజుల్లోనే ఆయనను మండలికి సిఫార్సు చేయాల్సి ఉంది. అలా చేయకపోతే.. మంత్రిపదవిని సైతం ఆయన కోల్పోవడం ఖాయం. ఇక, కోదండరాంను ఇప్పటికే గతంలో గవర్నర్ కోటా కింద సిఫార్సు చేసినా.. అది ఫలించలేదు. ఉద్యమ నాయకుడిగా పేరుతెచ్చుకున్న కోదండరాంను సభకు పంపించడం ద్వారా.. రాజకీయ మైలేజీ ఉంటుందని రేవంత్ ఆశలు పెట్టుకున్నారు. ఈ ఇద్దరిని గవర్నర్ కోటాలోనే మండలికి పంపించాలని భావిస్తున్నారు. ప్రస్తుతం కేంద్రం ఆగ్రహంతో ఉన్న నేపథ్యంలో.. కేంద్రం చెప్పుచేతల్లోనే గవర్నర్‌లు పనిచేస్తున్న కారణంగా.. రేవంత్ ఆశలు ఫలిస్తాయా? అనేది ప్రశ్న. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# తెలంగాణ ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు అడ్డుకోండి



**తెలంగాణ ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు అడ్డుకోండి**
**చంద్రబాబుకు మంత్రి పొన్నం బహిరంగ లేఖ**

హైదరాబాద్: రాష్ట్ర విభజనపై వివాదాస్పద మాటలు, అనుచిత వ్యాఖ్యలు చేయకుండా కూటమి నేతలను అడ్డుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. తెలంగాణ ఏర్పాటుపైఅనవసర ద్వేషాలు రగల్చడం ఎవరికీ మంచిది కాదని ఇది మీకు తెలియంది కాదన్నారు. ఏపీలో మీ భాగస్వామ్య పక్షాలైన బీజేపీ నాయకులొకవైపు, జనసేన అధినేతతో పాటు మరోవైపు టీడీపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు సముచితంగా లేవని రాష్ట్ర విభజన ఏదో అనుచితంగా జరిగినట్టు, అసమంజసంగా తెలం గాణ ఏర్పడినట్టు చేస్తున్న అసందర్భపు వ్యాఖ్యలు తెలుగువారి మధ్య అనవసరమైన స్పర్థలు, వైషమ్యాలు, ద్వేషాలు రగిలించేవిగా ఉంటున్నాయన్నారు. ఇది ఎవరికీ మంచిది కాదని ఏపీలో సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపుతున్న కూటమిపెద్దగా మీరుచొరవ తీసుకొని మీభాగస్వామ్య పక్షాలైన పార్టీ నేతల వ్యాఖ్యల విషయంలో జోక్యం చేసుకోవాలన్నారు. ఈ మేరకు మంగళవారం చంద్రబాబుకు పొన్నం బహిరంగ లేఖ రాశారు.

రాష్ట్ర విభజన చట్టబద్ధం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా మీరు సుదీర్ఘకాలం రాష్ట్రాన్ని పాలించారని తెలంగాణ ప్రజల ఆర్తి, ఆకాంక్ష మీకు తెలియంది కాదన్నారు. 2000 తొలి దశకమంతా జరిగిన పోరాటాలకు ఉద్యమాలకు మీరు ప్రత్యక్ష సాక్షి అన్నారు. రాష్ట్ర విభజనలో ప్రతి చర్య చట్టబద్ధం, రాజ్యాంగబద్ధం అని లోకసభ, రాజ్యసభ బిల్లు ఆమోదం పొంది రాష్ట్రపతి ఆమోదంతో గెజిట్ విడుదల చేసిందని గుర్తు చేశారు. ఇలా అన్ని పక్షాల ఆమోదంతో జరిగిన రాష్ట్ర విభజన అనంతరం ఎవరి పంథాలో వారు అభివృద్ధి మార్గంలో సాగుతున్నాయి. ఇటువంటి సయమలో రాష్ట్ర విభజనపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయొద్దని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజనను బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య పార్లమెంట్ ప్రత్యేక భేటీ వేదికగా చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై విషం చిమ్మే విధంగా ఉన్నాయని, ఆంధ్ర ప్రగతికి తెలంగాణ దిష్టి తగిలిందంటూ మీ మరో భాగస్వామి జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు తెలంగాణ మనోభావాల్ని కలతకు గురిచేశాయన్నారు. ఇవి తెలుగు వారి మధ్య వైషమ్యాలు పుట్టించేవే! అలా మాట్లాడటం తప్పని మీ మంత్రివర్గ సహచరునికి చెప్పాలన్నారు.

మోడీనే కారణం:వీటన్నింటికి మూలం ప్రధాని నరేంద్ర మోడీ చేసిన అనుచిత వ్యాఖ్యలే కారణం అనుకుంటున్నానని 'రాష్ట్ర విభజన ద్వారా తల్లి–బిడ్డను విడగొట్టార'ని ఒకమారు, 'బిడ్డను సంరక్షించడానికి తల్లినిచంపార'ని మరొకసందర్భంలో ఆయన అనుచితంగా మాట్లాడారన్నారు. 'ఒక ఓటు రెండు రాష్ట్రాల'ని 1997లోనే తీర్మానం చేసినపార్టీ బీజేపీ అని బహుశాప్రధాని మోడీకి తెలియదేమో! మీరు రాజకీయాల్లో ఆయనకన్న సీనియర్ కనుక కూటమి భాగస్వామిగా ప్రధాని నరేంద్ర మోడీకి ఈ విషయంచెప్పాలన్నారు. మరే పార్లమెంటు సభ్యుడూ రాష్ట్ర విభజనపై అనుచిత, అసందర్భ, అన్యాయపు మాటలు మాట్లాడకుండాకట్టడి చేయడంతో పాటుతేజస్వి సూర్య రాష్ట్ర విభజనపై మాట్లాడిన మాటలు లోక్ సభ రికార్డులనుండి తొలగించేలా లోక్‌సభ స్పీకర్‌కు మీరు లేఖ రాయాలని విజ్ఞప్తి చేశారు. రెండు రాష్ట్రాలుగా ఉన్నా తెలుగువారందరం ఐక్యంగా, సామరస్యం తో, పరస్పర సహకారంతో అభివృద్ధి పథంలో సాగటం నేటి తక్షణ అవసరం అని ఇందుకు మీ సంపూర్ణ సహకారం కావాలన్నారు.

# ఔను ..లాయర్లతో మాట్లాడడానికే ఢిల్లీ వెళ్లా

మొదటిపేజీ తరువాయి...

రేపటి విచారణలో ముద్దాయిగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారు. గత నాలుగున్నరేళ్లుగా ఆయన స్టే మీద ఉన్నారు. రేవంత్‌రెడ్డి ఢిల్లీలో రాత్రి రాహుల్‌గాంధీతో, ఉదయం భాజపా వాళ్లతో తిరిగారు. కేసీఆర్ నిన్న బయటికి వచ్చినందుకే రెండో విడత రైతు భరోసా విడుదల చేశారు. పంట పెట్టుబడిగా ఇవ్వాల్సింది.. పంట చేతికి వచ్చాక వేశారు. కాళేశ్వరం మొత్తం కూలిపోయిందని ఇన్నాళ్లు దుష్ప్రచారం చేశారని హరీశ్‌రావు అన్నారు.

నేను ఢిల్లీ వెళ్తే సీఎంవో నుంచి లీకులు ఇచ్చారు. విషయం లేనివారే ఇలాంటి ప్రచారాలు చేస్తారు. నా ఢిల్లీ పర్యటనలో ఎలాంటి దాపరికం లేదు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచే ఢిల్లీకి వెళ్లా. ఫిరాయింపుల కేసుపై చర్చించేందుకే ఢిల్లీ వెళ్లాం' అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కుట్రలను ఎదుర్కోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు మాజీ మంత్రి హరీశ్ రావు వెల్లడించారు. జగిత్యాలలో బీఆర్ఎస్ సభ సమయానికే కాంగ్రెస్ సభ పెట్టడంపై మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లుందని సెటైర్లు వేశారు. కేసీఆర్ స్థాయి ఏంటో, రేవంత్ స్థాయి ఏంటో ప్రజలకు తెలుసన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ వైపే ఉన్నారన్నారు. జగిత్యాల సభలో కేసీఆర్ హుందాగా మాట్లాడారని తెలిపారు. నిన్నటి సభలో రేవంత్ పేరును కేసీఆర్ లేవనెత్తారా అని ప్రశ్నించారు. కానీ రేవంత్ పదేపదే క ఎసిఆర్ పేరు ఎత్తడం, ఆయనకున్న భయాన్ని గుర్తు చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ ఇప్పటికైనా హుందాగా మాట్లాడితే వచ్చే ఎన్నికల్లో కనీసం డిపాజిట్లయినా దక్కుతాయని మాజీ మంత్రి హితవుపలికారు. మిగిలిన రెండున్నరేళ్లయినా మంచి పాలన అందించాలని సూచించారు.కేసీఆర్ సభకు పోటీగా సీఎం రేవంత్ రెడ్డి నిన్న సభ పెట్టి తన కురచ బుద్ధి బయట పెట్టుకున్నాడని విమర్శించారు. జగిత్యాలలో కేసీఆర్ సభను ముందుగానే నిర్ణయించామని.. కానీ సంకుచిత మనస్తత్వంతో రేవంత్ రెడ్డి పోటీగా సభ పెట్టారని అన్నారు. కేసీఆర్ మాట్లాడే సమయానికి మైక్ పట్టుకున్నాడని విమర్శించారు. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లుగా రేవంత్ రెడ్డి తీరు ఉందని ఎద్దేవా చేశారు. సోషల్‌మీడియాలో కేసీఆర్ ప్రసంగాన్ని 36లక్షల మంది లైవ్ చూశారని హరీశ్‌రావు తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని కనీసం 4 లక్షల మంది కూడా చూడలేదని అన్నారు. కాంగ్రెస్ అఫిషియల్ సైట్‌లో కేవలం 54 మంది చూశారని పేర్కొన్నారు. రేవంత్ స్థాయి ప్రజలకు అర్థమైందని అన్నారు. ఇప్పటికైనా నీ స్థాయి తెలుసుకో అని రేవంత్ రెడ్డికి హితవు పలికారు. కేసీఆర్ ప్రసంగం అంతా హుందాగా ఉందని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ రేవంత్ రెడ్డి పేరు కూడా తీయలేదని పేర్కొన్నారు. కానీ రేవంత్ రెడ్డి ఎంతో ఫ్రస్టేషన్‌తో మాట్లాడారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రసంగం స్ట్రీట్ మెన్ కంటే ఘోరంగా ఉందని విమర్శించారు. రేవంత్ రెడ్డి స్పీచ్‌ను ప్రజలు చూడలేదంటేనే స్టేట్ మూడ్ తెలిసిపోయిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ సూచనలు పాటించి.. రెండున్నరేళ్లలోనైనా సరిగ్గా పనిచేస్తే కనీసం డిపాజిట్లు అయినా దక్కుతాయని అన్నారు. కేసీఆర్ వ్యాఖ్యలను బాధ్యతగా తీసుకుంటే బాగుంటుందని అన్నారు.

# ఏపి సచివాలయంలో 18వ సివిల్ సర్వీసెస్ దినోత్సవ వేడుకలు

అమరావతి, ఏప్రిల్ 21: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో మంగళవారం 18వ సివిల్ సర్వీసెస్ దినోత్సవ వేడుకలు జరుగుతున్నాయి. ఈకార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.వికసిత్ భారత్ స్వర్ణాంధ్ర 2047 సిటిజన్ సెంట్రిక్ గవర్నెన్స్ ఫర్ లాస్ట్ మైల్ డెలివరి అనే నినాదంతో ఈ వేడుకను నిర్వహిస్తున్నారు.అదే విధంగా కార్యక్రమంలో పాల్గొన్న అందరితో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనలో భాగంగా దేశ సమగ్రత, స్వేచ్ఛను కాపాడుతానని, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల ఫలాలు చిట్ట చివరి వ్యక్తి వరకూ సక్రమంగా అందేలా పారదర్శకంగా,నిష్పక్షపాతంగా చిత్త శుద్ధి అంకిత భావంతో పని చేస్తానని సివిల్ సర్వీసెస్ రీడిడికేషన్ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు,వివిధ శాఖాధిపతులు,ఇతర అధికారులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

# 'డీల్ కుదరకపోతే యుద్ధమే'

మొదటిపేజీ తరువాయి...

ఇప్పటికే అన్ని రకాల అత్యాధునిక ఆయుధాలను యుద్ధం కోసం సిద్ధం చేశాం అని ట్రంప్ ప్రకటించారు. ఇరాన్ పోర్టుల దిగ్బంధనం అమెరికా సాధించిన గొప్ప విజయమని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేవలం కాల్పుల విరమణతో సమస్య పరిష్కారం కాదని, పటిష్టమైన ఒప్పందం (డీల్) లేకుండా దీనిని కొనసాగించలేమని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ కోసం మేము ఒక అద్భుతమైన డీల్ సిద్ధం చేస్తున్నాం. దీని ద్వారా శాంతి, భద్రత, రక్షణ ఏర్పడతాయి. నేను రూపొందించిన ఈ ఒప్పందాన్ని చూసి యావత్ ప్రపంచమే గర్వపడుతుంది అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలతో అంతర్జాతీయంగా, ముఖ్యంగా ఇంధన మార్కెట్లో కలకలం మొదలైంది. అమెరికా తదుపరి అడుగు ఏంటన్నది ఇప్పుడు ప్రపంచ దేశాల్లో ఆసక్తికరంగా మారింది.

# ఏటీఎంలా మారిన కాళేశ్వరం ప్రాజెక్ట్

మొదటిపేజీ తరువాయి...

కేంద్రానికి రేవంత్‌రెడ్డి రాసిన లేఖలో ఏముందని అడిగారు. రూ.9వేల కోట్ల అవినీతిపై దర్యాప్తు జరపాలని సీఎం రేవంత్ అంటున్నారని.. మరి లక్ష కోట్ల స్కామ్ గురించి ఎందుకు లేఖ రాయలేదని ప్రశ్నించారు. రేవంత్ రాసిన లేఖలను కరపత్రాల రూపంలో ఇంటింటికీ పంచుతామన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఢిల్లీ టూర్‌పై ఒక్కొక్కరూ ఒక్కోలా మాట్లాడుతున్నారని కేంద్ర మంత్రి తెలిపారు. మహిళలు ఉన్నతస్థాయికి వెళ్లాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని కేంద్ర మంత్రి తెలిపారు. మహిళా బిల్లును కాంగ్రెస్ అడ్డుకోవడం మూర్ఖత్వమని మండిపడ్డారు. ఇందిరా, సోనియా, ప్రియాంక గాంధీకి పదవులు ఇస్తే మొత్తం మహిళలకు పదవులు వచ్చినట్టు భావిస్తున్నారన్నారు. విపక్షాల కుటుంబాల్లోని మహిళలకు పదవులు వస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వీగితే.. సీఎం రేవంత్ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్లేస్‌లో కూర్చోవాలని రేవంత్ రెడ్డి ఆలోచిస్తున్నారంటూ కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. మహిళా బిల్లు వీగిపోవడానికి స్టాలిన్, రేవంత్ రెడ్డినే కారణమని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎప్పటికీ కలవవని.. కలిసి పోటీ చేయమని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.

# గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి

### ఉపాధి హామీని మరింతగా విస్తరించాలి

### ఎక్స్ వేదికగా జగన్ పోస్ట్

అమరావతి,ఏప్రిల్ 21 : గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రభుత్వ మద్దతు క్రమంగా తగ్గిపోతుందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.. గ్రామీణ ప్రజలకు కీలకంగా ఉపయోగపడేజాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపిస్తూ ఎక్స్ వేదికగా స్పందించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలంటే ఎంజీఎన్ఆర్ఈజీఏ పథకం సమర్థవంతంగా అమలు కావడం అత్యంత కీలకమని జగన్ పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల చేతిలో ఖర్చు చేయగలిగే ఆదాయం పెరుగుతుందని, దాంతో గ్రామీణ మార్కెట్లలో వినియోగం పెరిగి ఆర్థిక చలనం వస్తుందని వివరించారు. ఎక్కువగా ఖర్చు చేసే వర్గాల చేతిలో డబ్బు ఉంటే గ్రామీణ ఆదాయ వినియోగం పెరుగుతుందని, అది మొత్తం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుందని అన్నారు వైఎస్ జగన్. గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంజీఎన్ఆర్ఈజీఏ అమలులో దేశవ్యాప్తంగా అగ్రగామి రాష్ట్రంగా గుర్తింపు పొందిందని గుర్తు చేశారు. అయితే, గత రెండేళ్లుగా టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలో ఈ పథకం పనితీరు తీవ్రంగా పడిపోయిందని జగన్ విమర్శించారు. లేబర్ బడ్జెట్, పని చేసిన కుటుంబాల సంఖ్య, ఖర్చు చేసిన నిధులు వంటి అన్ని అంశాల్లో గణనీయమైన తగ్గుదల కనిపిస్తోందని ఆరోపించారు. గత రెండేళ్లలో జీఎస్టీ, సేల్స్ ట్యాక్స్ వృద్ధి రేట్లు కూడా తగ్గాయని జగన్ తెలిపారు. ఇది ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయిందనే సంకేతమని అన్నారు. ప్రజల చేతిలో డబ్బు లేకపోవడంతో డిమాండ్ పడిపోతుందని, దాని ప్రభావం వ్యాపార రంగంపై కూడా పడుతోందని చెప్పారు. ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం విఫలమవుతోందని దుయ్యబట్టారు.. అవినీతి ఆరోపణలు, సంపద కూడబెట్టాలనే అధిక ఆశలతో ప్రభుత్వం దారి తప్పుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలను పట్టించుకునే స్థితిలో ప్రభుత్వం లేదని మాజీ సీఎం జగన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# సంపాదకీయం

## విపక్షాల ఐక్యతను బలోపేతం చేసిన మోడీ !

ప్రజాస్వామ్యంలో నిరంకుశం చేస్తామంటే కుదరదు. ప్రతి విషయంలోనూ అలాగే వ్యవహరిస్తున్న మోడీ, ఇప్పుడు 131వ రాజ్యాంగ సవరణ విషయంలోనూ అలాగే చేసారు. మహిళా బిల్లు సందర్భంగా సరిగ్గా అదే జరిగింది. బిజెపి నిరంకుశ విధానంపై ఓ రకంగా తిరుగుబాటుగానే భావించాలి. అలాగే విపక్షాలను ఐక్యం చేసిన ఘనత కూడా మోడీదనే చెప్పాలి. వారి ఓటు చెక్కుచెదరకుండా వేయగలిగారు. అలాగే వారంతా ఒక్కటిగా నిలబడేలా చేశారు. ఇది భవిష్యత్ రాజకీయాలకు కీలక మలుపుగా భావించాలి. అందుకే 131వ రాజ్యాంగ సవరణ వీగిపోయింది. ఇకపోతే మహిళా బిల్లు వేరు..డీ లిమిటేషన్ వేరు. 2023లోనే దీనిని ఆమోదించి, 2029 నుంచి అమల్లోకి తీసుకుని వస్తామని గతంలోనే చెప్పారు. అనూహ్యంగా ఇప్పుడు రెండూ కలగలిపి తీసుకుని రావడం ద్వారా బిజెపికి శృంగభంగం తప్పలేదు. నిజానికి ఈ బిల్లులను తీసుకుని వచ్చే ముందు అఖిలపక్షంలో చర్చించలేదు. విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోలేదు. సొంతపార్టీలో చర్చించలేదు. ఎన్‌డిఎ పక్షాలతోనూ చర్చించలేదు. బహుశా మోడీ, అమిత్ షాలు మాత్రమే చర్చించుకుని ఈ సవరణ బిల్లుకు యత్నించి ఉంటారు. బహుశా వారు ఇలాంటి పరిణామం ఎదురవుతుందని కూడా ఊహించ ఉంటారు. దీనిని ఆసరాగా చేసుకుని విపక్షాలను ఎండగట్టాలన్న ఉద్దేశం కూడా ఇందులో దాగి ఉంటుంది. అయితే విపక్షాల ఐక్యత ఇప్పుడు మోడీకి సవాల్ కానుంది. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి సంపూర్ణ మెజార్టీ కోల్పోయింది. కేవలం ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతోంది. కనీసం ఎన్‌డిఎ పక్షాలతో అయినా మోడీ సమగ్రంగా చర్చించి ఉంటారని అనుకోవడానికి లేదు. ఒకప్పుడు బిజెపిలో మేధావి వర్గం ఉండేది. ఏదైనా సమస్యను ముందు పార్టీలో మేధావి వర్గంతో చర్చించేవారు. ఎత్తులు వేసేవారు. కానీ మోడీ వచ్చాక పెద్దలను దూరం పెట్టారు. ఇప్పుడు పెద్దా, చిన్నా అంతా ఆయనే. అందుకే మహిళా బిల్లు ముసుగులో డీలిమిటేషన్ తీసుకుని రావాలన్న ఎత్తుగడలను ప్రతిపక్షాలు ఉమ్మడి గా చిత్తుచేశాయి. మహిళా బిల్లును ఉన్నపళంగా అమలు చేయడానికి విపక్షాలు సిద్దంగా ఉన్నాయి. కానీ మోడీ ఎందుకనో అలా చేయకుండా మెలికి పెట్టారు. డీలిమిటేషన్ వల్ల కూడా సభ్యుల సంఖ్య పెరిగితే కూడా నష్టమే. 542 స్థానాలు ఉన్న లోక్‌సభ 600 వరకు పెరిగితే ఫర్వాలేదు. కానీ 816 లేదా 850కి పెంచాలన్న తీరు మాత్రం ఆమోదించదగ్గది కాదు. రాజకీయంగా పదవులు పెరిగితే దేశానికి నష్టమే తప్ప లాభం లేదు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో బిజెపి వ్యవహరించిన తీరు, దానిని తరిస్కరించిన వైనం బిజెపికి గుణపాఠం కావాలి. ఇప్పటికైనా మేల్కొని ప్రజాస్వామ్య బద్దంగా పాలన చేయకుంటే విపక్షాలు మరింత ఐక్యం అవుతాయని నిరూపించాయి. ఇప్పటికే సర్ ప్రక్రియ సెగరేపుతోంది. ఇప్పుడు 131 సవరణ తోడయ్యింది. ప్రజలు ఎప్పుడూ బిజెపి వెంటే ఉంటారని అనుకోవడానికి లేదు. తాజా 131 సవరణ ప్రతిపాదన దక్షిణాదిలో కూడా తీవ్ర చర్చకు దారితీసింది. తమకున్న అధికారం పోతోఉందని, తమ ప్రాతినిధ్యానికి విలువ ఉండదన్న భావనలో ఇక్కడి నేతలు వచ్చారు. అందుకే దక్షిణాది నేతలు కేంద్ర ప్రభుత్వం హడావిడిగా తెచ్చిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా పోరాటం చేసారు. మోదీ సర్కారుకు ఓటమి రుచి చూపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ముందుపెట్టి.. డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకోవాలన్న కేంద్ర ఎత్తుగడను లోక్‌సభలో శుక్రవారం మూకుమ్మడిగా తిప్పికొట్టడం వెనక ఈ ఐక్యత స్పష్టంగా కనిపించింది. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లు సభలో వీగిపోయేలా చేయటంలో దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు కూడా కీలకపాత్ర పోషించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పార్టీలు మినహా తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటకలోని ఎన్డీయే యేతర పార్టీల ఎంపీలంతా ఈ బిల్లును మరో ఆలోచనకు తావులేకుండా తిరస్కరించారు. తమిళనాడుకు చెందిన 38మంది, కేరళలోని 20 మంది, తెలంగాణలోని 9మంది, కర్ణాటకలోని 9 మంది ఎన్డీయే యేతర ఎంపీలు డీలిమిటేషన్ బిల్లును అడ్డుకోవటంలో కీలకపాత్ర పోషించారు. డీలిమిటేషన్ బిల్లును బహిరంగా తగులబెట్టి తమ నిరసన ఏ స్థాయిలో ఉంటుందో చూడాలని కేంద్రాన్ని తమిళనాడు సిఎం స్టాలిన్ సవాల్ చేశారు. పార్లమెంటులోనూ తమిళనాడు ఎంపీలు నల్ల దుస్తులు ధరించి బిల్లుకు వ్యతిరేకంగా బలంగా పోరాటం చేశారు. కొత్తగా జనాభా లెక్కలను సేకరించకుండానే మోదీ సర్కారు ఏకపక్షంగా, హడావిడిగా డీలిమిటేషన్‌కు పూనుకోవటం పై అందరిలోనూ అనుమానాలు బలపడ్డాయి. కేంద్రం దక్షిణాదికి ద్రోహం చేస్తోందని ఎలుగెత్తారు. తమ రాష్ట్రాల ప్రాతినిధ్యం లేకుండానే భవిష్యత్తులో ఉత్తరాది బలంతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు జరిగేలా దక్షిణాది ప్రాతినిధ్యంతో పనిలేకుండా చేయటమే మోదీ సర్కారు అసలు లక్ష్యమని విమర్శలు గుప్పించారు. రాజ్యాంగాన్ని బలహీనపర్చి, దేశ ఎన్నికల ముఖచిత్రాన్నే మార్చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందని కమ్యూనిస్టు పార్టీలు కూడా పోరాటం చేశాయి. అందుకే కసిగా ఉన్న స్టాలిన్ 'ఢిల్లీని తమిళనాడు ఓడించింది' అని ప్రకటించారు. ఈ క్రమంలో ఇప్పుడు బిజెపి పునరాలోచన చేయాలి. పెద్దలను, మేధావులను గౌరవించడం అలవాటు చేసుకవాలి. కీలకమైన ఇలాంటి సవరణల సందర్భంలో విపక్షాలను విశ్వాసంలోకి తీసుకో వాలి. డీలిమిటేషన్ కూడా లిమిట్ దాటకుండా సీట్లను కుదించాలి. అందరి ఆమోదంతో మళ్లీ బిల్లును ప్రవేశ పెట్టడం ద్వారా ముందుగా మహిళా బిల్లుకు ఆమోదం దక్కేలా చూడాలి. అప్పుడే పోయిన పరువు కొంతయినా దక్కుతుంది. అంతే తప్ప మహిళా బిల్లును వ్యతిరేకించారన్న ప్రచారం ఫలితం ఇవ్వదని గుర్తించాలి.

## విద్యార్థిని ప్రాణం తీసిన ఇంటర్ పరీక్ష ఫలితాలు



కారేపల్లి : ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఫెయిల్ అయిన కారణంగా యువతి మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన కారేపల్లి మండలంలో చోటుచేసుకుంది. కారేపల్లి ఎస్సై బైరు గోపి తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని మేకల తండా-దుబ్బ తండా గ్రామానికి చెందిన గుగులోత్ సంజన (17) కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతోంది. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ కావడంతో తీవ్ర నిరాశకు లోనైన ఆమె ఇంట్లో ఉన్న ఎలుకల మందు సేవించింది. విషయం ఇంట్లో చెప్పకపోవడంతో కుటుంబ సభ్యులు ఆలస్యంగా తెలుసుకొని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ ఈ నెల 19న రాత్రి 10 గంటలకు ఆమె మృతి చెందింది. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగా, గ్రామంలో విషాద ఛాయలు నెలకొంది. కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ సందర్భంగా ఎస్సై బైరు గోపి మాట్లాడుతూ పరీక్షల్లో అపజయంతో జీవితం అంతం కాదని అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు మానసిక బలాన్నిచ్చి, ప్రోత్సహించాలని అన్నారు. విద్యార్థులు కూడా ఒత్తిడిని జయించి ముందుకు సాగాలని తెలిపారు. ఒక చిన్న నిరాశ కారణంగా జీవితాన్ని కోల్పోవడం మంచిది కాదన్నారు. జీవితానికి విలువ ఇచ్చే ఆలోచనలతో ముందుకు సాగాలని అన్నారు.

## ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, చీఫ్ ఎలెక్టోరల్ కార్యాలయ అధికారులు



నిర్మల్, ఏప్రిల్:21(తెలంగాణ వాణి ప్రతినిధి): కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని మంగళవారం, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, చీఫ్ ఎలెక్టోరల్ కార్యాలయ ఈవీఎం రాష్ట్ర నోడల్ అధికారి బి. హరిసింగ్ లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను, సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు.

పోలీసు సిబ్బంది నిరంతరం మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. ఎల్లప్పుడు అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈవీఎం గోదాం తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అధికారులు సర్ఫరాజ్, రాజశ్రీ, బిజెపి, టీడీపీ, ఆమ్ ఆద్మీ, ఎంఐఎం పార్టీల ప్రతినిధులు కోరిపల్లి శ్రవణ్ రెడ్డి, సిరికొండ రమేష్, హైదర్, మజార్, ముజాయిద్ అలీ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కోనేరు కోనప్ప నివాసంలో అంబలి తయారీ

### -ప్రతిరోజు 5000 లీటర్ల అంబలి పంపిణీ



కాగజ్ నగర్,ఏప్రిల్ 21 (తెలంగాణ వాణి):రేపటి అంబలి పంపిణీ కార్యక్రమం కోసం కోనేరు కోనప్ప నివాసంలో అంబలి తయారీ పనులు కొనసాగు తున్నాయి.ఎండలు తీవ్రంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఉపశమనం కలిగించాలనే లక్ష్యంతో ప్రతిరోజు సుమారు 5000 లీటర్ల అంబలి సిద్ధం చేస్తున్నారు.ఈ కార్యక్రమం కోసం ముందురోజే శ్రమతో,శ్రద్ధతో అంబలి తయారు చేయడం ప్రత్యేకతగా నిలుస్తోంది.కాగజ్‌నగర్ పట్టణంలో ప్రజల ఆరోగ్యం,శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని కోనేరు కోనప్ప ఈ అంబలి పంపిణీ కార్యక్రమా న్ని నిరంతరం కొనసాగిస్తున్నారు.కూలీ పనులకు వెళ్లే కార్మికులు,ప్రయాణికులు, వృద్ధులు, సామాన్య ప్రజలు ఎండ వేడిలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతోంది.ఈ సేవా కార్యక్రమం ద్వారా కోనేరు కోనప్ప సమాజానికి ఆదర్శంగా నిలుస్తూ,సేవా భావంతో ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదిస్తున్నారని ప్రజలు వ్యక్తపరిచారు.

## విద్యార్థులు లక్ష్యశుద్ధితో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షిషా



ఆదిలాబాద్, ఏప్రిల్, 21 ( తెలంగాణ వాణి ప్రతినిధి ): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని, ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. మంగళవారం 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా ఇచ్చోడ మండలంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 'స్టూడెంట్ టాలెంట్ ఫెస్ట్'లో భాగంగా నిర్వహించిన వక్తృత్వ, క్విజ్, చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను బయటకు తీసేందుకు ఇలాంటి వేదికలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. గత ఏడాది ఇంటర్ ఫలితాల్లో ఈ కళాశాల 91 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉచిత విద్యతో పాటు ఉన్నత చదువుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న 'స్టార్ 50' వంటి శిక్షణ కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా బాలికా విద్య ఆవశ్యకతను గుర్తు చేస్తూ, 6 నుండి 14 ఏళ్ల పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అందించే 'రైట్ టు ఎడ్యుకేషన్' చట్టం గురించి వివరించారు. సెలవుల అనంతరం విద్యార్థులు గైర్హాజరు కాకుండా పాఠశాలలకు రావాలని, డ్రాపౌట్స్ లేకుండా చూడటంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చొరవ చూపాలని సూచించారు. అనంతరం అధికారులతో కలిసి పాఠశాల ప్రాంగణాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. గత ఏడాది వరదల కారణంగా కూలిపోయిన ప్రహరీ గోడ సమస్యను పరిష్కరించేందుకు, పాఠశాల ఆధునీకరణకు 2 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. ఈ నిధులతో విద్యుత్, తాగునీరు, టాయిలెట్లు, అదనపు తరగతి గదులు, డార్మిటరీల మరమ్మత్తు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. వేసవి దృష్ట్యా విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, సరిపడా నీరు తాగుతూ హైడ్రేటెడ్‌గా ఉండాలని, ప్రతి గురువారం ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలోని కూలిన ప్రహరీగోడ, డ్రైనేజీ నిర్మాణాలను కలెక్టర్, అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిపిఓ రమేష్, డిఎల్పిఓ ఫణిందర్, పంచాయతీ రాజ్ ఈఈ శివరాం, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తనాజీ, తహసిల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపిడిఓ రవీందర్, ప్రిన్సిపాల్ గీతాంజలి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీ ఓటర్ సర్వే.. పుంజుకోని వైసీపీ.. ఏకపక్షంగా కూటమి

విజయవాడ, : ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతోంది. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చెబుతోంది. జగన్మోహన్ రెడ్డి సైతం పదేపదే ఇదే హెచ్చరిస్తూ వస్తున్నారు. ఇప్పటికే రెండేళ్లు గడిచిపోయిందని.. మరో రెండేళ్లు ఇట్టే గడిచిపోతే వచ్చేది మన ప్రభుత్వమేనని గట్టిగానే చెబుతూ వచ్చారు. అయితే గతంలోనే వై నాట్ 175 అన్న నినాదం ఇచ్చి చతికిల పడింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అందుకే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి మరోసారి తమదే అధికారం అని చెబుతున్న మాటలు విశ్వాసానికి నోచుకోలేదు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిని తెలుసుకొని మాట్లాడుతున్నారా? లేకుంటే అతి ధీమాతో ఈ వ్యాఖ్యలు చేస్తున్నారా? అనే అనుమానాలు ఉన్నాయి. సరిగ్గా ఇటువంటి సమయంలోనే సి ఓటర్ సంస్థ చేపట్టిన సర్వే సంచలనంగా మారింది.ఏపీలో ప్రభుత్వ పనితీరు, ప్రతిపక్షం పనితీరుపై గత కొద్దిరోజులుగా సర్వే చేసింది సి ఓటర్ . దానికి సంబంధించిన ఫలితాలు మైండ్ బ్లాక్ అయ్యేలా ఉన్నాయి. 2014లో తెలుగుదేశం కూటమి ఘన విజయం సాధించింది. జనసేన, బిజెపితో కలిసి పోటీ చేసింది. అప్పుడు ఆ మూడు పార్టీలకు 55.3% ఓట్లు వచ్చాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 39.4% ఓట్లు వచ్చాయి. ఎన్నికలు జరిగి దాదాపు రెండేళ్లు అవుతోంది. అయితే కూటమి ప్రభుత్వం పట్ల ప్రజా వ్యతిరేకత ప్రారంభం అయింది అని జగన్మోహన్ రెడ్డి తో పాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు గట్టిగానే చెబుతున్నారు. ప్రజల్లోకి ఆ ప్రచారాన్ని బలంగా తీసుకెళుతున్నారు.అయితే తాజాగా సి ఓటర్ సంస్థ ఒక సంచలన సర్వేను బయటపెట్టింది. ఇప్పటికి ఇప్పుడు ఎన్నికలు పెడితే కూటమి పార్టీలకు గతం కంటే ఎక్కువ ఓట్లు వస్తాయి అన్నది దీని సారాంశం. ఏకంగా 57.5% ఓట్లను కూటమి దక్కించుకుంటుందన్నది ఈ సర్వేలో తేలింది. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 37.5% మాత్రమే ఓట్లు దక్కుతాయని తేల్చింది. ఈ లెక్కన ఆ కూటమి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మధ్య ఏకంగా 20% ఓట్ల తేడా కనిపిస్తోంది. అయితే మధ్యలో బిజెపి లేకపోయినా.. టిడిపి, జనసేన కలిసి పోటీ చేస్తే ఆ కూటమిదే విజయం అని తేల్చింది ఈ సర్వే. ప్రస్తుతం ఈ సర్వే ను వైరల్ చేస్తున్నారు టిడిపి కూటమి శ్రేణులు.అయితే ఈ సర్వే చెప్పిందని కాదు కానీ.. తెలుగుదేశం పార్టీతో జనసేన కొనసాగిన క్రమంలో ఆకూటమిదే విజయం అన్న విశ్లేషణలు ఉన్నాయి. ఇదివరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ నేత విజయసాయిరెడ్డి ఇదే విషయాన్ని చెప్పారు.. తాజాగా విశ్లేషకుడు ముసుగులో ఉండవల్లి అరుణ్ కుమార్ కూడా దీనినే తేల్చారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు కరిగిపోయింది. ఆ పార్టీకి సరైన నాయకత్వం కూడా లేదు. చాలా నియోజకవర్గాల్లో ఆ పార్టీ పరిస్థితి దయనీయంగా ఉంది. ఇప్పుడు తాజా సర్వేలో అదే స్పష్టమైంది. చూడాలి మరి ఇందులో ఎంత వాస్తవం ఉందో..

### జనగణ సిబ్బంది సమీక్ష సమావేశానికి హాజరైన..

## జన గణ డైరెక్టర్ భారతి హోలీ కేరి



మెదక్ జిల్లా ఏప్రిల్ 21: (తెలంగాణ వాణి ప్రతినిధి): మంగళవారం రోజునమెదక్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్,జనగణ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. జనగణన 2027 లో భాగంగా హౌస్ లిస్టింగ్ బ్లాక్స్, సెన్సస్ మానిటరింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ డిజిటల్ విధానం, స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) పై సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు జన గణనకు సంబంధించిన కిట్లను సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొదటి దశలో మే 11 వ తేదీ నుంచి జూన్ 09 వ తేదీ వరకు ఇండ్ల గణన నిర్వహిస్తారని, రెండో దశ ఫిబ్రవరి 2027 లో వ్యక్తుల వారిగా సమాచారం సేకరిస్తారని అధికారులు తెలిపారు. ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా సేకరించి.. నమోదు చేయాలని ఆదేశించారు. అందరి వివరాలు గోప్యంగా ఉంచాలని స్పష్టం చేశారు. ఎండాకాలం నేపథ్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీటి బాటిల్ వెంట తీసుకువెళ్లాలని సూచించారు. ఈ నెల 26 వ తేదీన స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా చేసుకోవాలని ఆదేశించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బాధ్యతల నిర్వహణలో ఎంతో కీలకమని స్పష్టం చేశారు. వివరాలు పక్కాగా సేకరించి నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జిల్లా ప్రతిమా సింగ్ , మెదక్ ఆర్ డి ఓ రమాదేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ,ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతాయుతంగా జనగణన పూర్తి చేయాలి

### తెలంగాణ రాష్ట్ర జన గణన డైరెక్టర్ భారతి హోలీకెరీ



మెదక్ : ఏప్రిల్ 21, (తెలంగాణ వాణి ప్రతినిధి): జనగణన – 2027ను సూపర్ వైజర్లు ఎన్యూమరేటర్లు బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని జనగణ డైరెక్టర్ భారతి హోలీకెరీ అన్నారు మంగళవారం మెదక్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ జనగణ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు జనగణన 2027 లో భాగంగా హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ సెన్సస్ మానిటరింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ డిజిటల్ విధానం, స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) పై సూపర్ వైజర్లు ఎన్యూమరేటర్లకు జన గణనకు సంబంధించిన కిట్లను సూపర్ వైజర్లు ఎన్యూమరేటర్లకు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి దశలో మే 11 వ తేదీ నుంచి జూన్ 09 వ తేదీ వరకు ఇండ్ల గణన నిర్వహిస్తారని రెండో దశ ఫిబ్రవరి 2027 లో వ్యక్తుల వారిగా సమాచారం సేకరిస్తారని అధికారులు తెలిపారు. ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా సేకరించి నమోదు చేయాలని ఆదేశించారు. అందరి వివరాలు గోప్యంగా ఉంచాలని స్పష్టం చేశారు ఎండాకాలం నేపథ్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు నీటి బాటిల్ వెంట తీసుకువెళ్లాలని సూచించారు. ఈ నెల 26 వ తేదీన స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా చేసుకోవాలని ఆదేశించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బాధ్యతల నిర్వహణలో ఎంతో కీలకమని స్పష్టం చేశారు. వివరాలు పక్కాగా సేకరించి నమోదు చేయాలని ఆదేశించారు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జిల్లా ప్రతిమా సింగ్ మెదక్ ఆర్ డి ఓ రమాదేవి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ,ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

# తల వంచక శ్రమించు!



జీవితమంటే చదువులు, మార్కులు, ర్యాంకులేనా? విజయానికి ఇవే కొలమానాలా? గొప్పగొప్ప వాళ్లంతా పెద్దపెద్ద చదువులు చదివినవారేనా? పరీక్షల్లో ఫెయిలైతే జీవితం ముగిసిపోయినట్లేనా? ఆత్మహత్యలే శరణ్యమా? ...కానేకాదు. జీవితంలో చదువు, కెరీర్ ఒక భాగం మాత్రమే. చదువంటే విజ్ఞానం. మంచిచెడుల విచక్షణను తెలియజెప్పే జ్ఞాననేత్రం. అయితే, నేటి విద్యావిధానం మార్కులు, ర్యాంకుల చుట్టూనే తిరుగుతోంది. పిల్లల ప్రతిభను ఈ కొలమానంతో కొలవడం మానవీయతకు విరుద్ధం. 'పిల్లల ఆలోచనలను బంధించకండి, అవి వికసించాలి' అంటారు టాగూర్. కానీ మనం పిల్లల వికాసాన్ని అడ్డుకుంటున్నాం. మానసిక ఒత్తిడిని పెంచుతున్నాం. ఇటీవలి కాలంలో విద్యార్థుల ఆత్మహత్యలు సామాజిక సమస్యగా మారింది. చదివేది, పరీక్షలు రాసేదీ విద్యార్థులైతే, వాటి ఫలితాల కోసం ఎదురు చూసేది, వారి భవితపై అంచనాలు పెంచుకునేది వారి తల్లిదండ్రులు. వారి ర్యాంకులతో వ్యాపారం చేసేది ఆయా విద్యాసంస్థలు. ఈ ఒత్తిళ్ల మధ్య చదువులు, ర్యాంకుల వాతావరణానికి తోడు రకరకాల ఆర్థిక, సామాజిక, వివక్షల వంటి అనేక కారణాలు విద్యార్థుల్లో విపరీతమైన మానసిక సమస్యలను సృష్టిస్తున్నాయి. తల్లిదండ్రుల అంచనాలను, విద్యాసంస్థల ఒత్తిళ్లను తట్టుకోలేక కుంగుబాటుతో, నిస్సహాయతతో కొందరు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు.

తాజాగా వచ్చిన ఇంటర్ ఫలితాల అనంతరం పదిమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. తెలంగాణలో ఒక్కరోజులోనే ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే, ఎపి లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. టెన్త్, ఇంటర్ ఫలితాలొచ్చిన ప్రతిసారీ చిన్నారుల ఆత్మహత్యల వార్తలు మనం చూస్తూనే వున్నాం. రోటి దెబ్బ, రోకటి దెబ్బ అన్నట్లుగా మారింది విద్యార్థుల పరిస్థితి. కార్పొరేట్ విద్యా ఫ్యాక్టరీలు ర్యాంకుల కోసం విద్యార్థులను యంత్రాల్లా మార్చుతున్నాయి. పిల్లలపై తల్లిదండ్రుల అంచనాలకు హద్దు లేకుండా పోతోంది. వారి అంచనాలను అందుకోలేక మరొకరితో పోల్చడాన్ని తట్టుకోలేక.. బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇవి కేవలం పిల్లల వ్యక్తిగత వైఫల్యాల ఫలితం కాదు. సమాజం, విద్యావ్యవస్థలోని లోపాల ప్రతిబింబం. సుప్రీంకోర్టు సైతం 'ఇది వ్యవస్థాగత లోపానికి నిదర్శనం' అని వ్యాఖ్యానించిందంటే.. పరిస్థితి తీవ్రత ఎంతగా వుందో అర్థం చేసుకోవచ్చు. పరీక్షల ఒత్తిడిలో వున్న పిల్లలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. వారికి మానసిక స్థైర్యాన్నివ్వడం ముఖ్యం. 'గుండెల్లో మంట వుంది/ అది నిన్ను దహించేది కాదు/ నీ గమ్యాన్ని వెలిగించేది కావాలి' అంటారో కవి.

చిన్నా... మార్కులు, ర్యాంకుల కోసమే నువ్వు పుట్టలేదు. ఫెయిలైతే మళ్లీ చదువు... మళ్లీ చదువు. అసలు చదువే ఇష్టం లేకపోతే... నీకు అభిరుచి వున్న మరో రంగంలో నీ సత్తా చాటు. ఎవరో ఏదో అంటారనో, అనుకుంటారనో నిన్ను నీవు శిక్షించుకోకు. జీవితమంటేనే పోరాటం. పోరాడు... విజయం సాధించు. అంతేగాని ఓటమి నిన్ను పలకరించిందని నిరాశ చెందకు. "ఫెయిల్' అంటే- నేర్చుకోవడంలో మొదటి ప్రయత్నం' అంటారు అబ్దుల్ కలాం. తరగతి గదిలో వెనకబడిన వారు జీవితంలో అద్భుతాలు సాధించిన ఘటనలు అనేకం చరిత్రలో వున్నాయి. మందబుద్ధి గల విద్యార్థిగా ముద్రపడిన ఐన్‌స్టీన్ గొప్ప శాస్త్రవేత్తగా ఎదిగాడు. చదువులో రాణించలేకపోయిన కమల్‌హాసన్... నటనలో బహుముఖ ప్రజ్ఞాశాలిగా ప్రపంచ గుర్తింపు పొందాడు. సచిన్ టెండూల్కర్, ధోనీ వంటి ప్రముఖ క్రికెటర్లు హైస్కూల్ చదువులతోనే సరిపెట్టుకున్నారు. ప్రపంచ కుబేరుల్లో ఒకరైన ధీరూబారు అంబానీ 16 ఏళ్ల వయసులోనే క్లర్క్‌గా జీవితం ప్రారంభించాడు. వీరే కాదు, స్టీవ్‌జాబ్స్, బిల్‌గేట్స్, అబ్రహాం లింకన్, వాల్ట్ డిస్నీ వంటి ఏ ఒక్కరి జీవితమూ ఉన్నత చదువులతో ప్రారంభం కాలేదు. వీరంతా తమకు నచ్చిన, అభిరుచి కలిగిన రంగంలో స్వయంకృషితో ఎదిగినవారే. ఇంటర్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయనో, పదిలో ఫెయిల్ అయ్యామనో తనువు చాలించితే... భవిష్యత్‌లో దేశం ఒక గొప్పవ్యక్తిని కోల్పోయినట్టే. నీ శ్రమతో కొత్త చరిత్రను లిఖించు. ఓటమి నిన్ను పలకరిస్తే.. నవ్వుతూ సాగనంపు, గెలుపు నీ ముంగిట తలవంచే వరకూ విశ్రమించక శ్రమించు.

## ప్రభుత్వ ఆసుపత్రి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: ఏఐటీయూసీ



కార్వాన్ : ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. మంగళవారం కోఠిలోని డీఎంఈ కార్యాలయం ముందు తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఆందోళన చేపట్టారు. ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యాలయం ముందు బయట నుంచి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు కనీస వేతనం 26వేలు, పండగ, జాతీయ, ఆర్జిత సెలవులు, బోనస్ లాంటి చట్టాల అమలు చేయాలన్నారు. శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ విధులు నిర్వహించేందుకు మూడు సంవత్సరాల కాలపరిమితికి టెండర్లను పిలిచినట్టు తెలిపారు. జి.ఓ.నెం. 60 ప్రకారం.. జీతాలు చెల్లించాలని టెండర్ షెడ్యూల్లో ఉన్నప్పటికీ, గత నాలుగు సంవత్సరాల కాలంలో ఆ జి.ఓ. ప్రకారం.. కార్మికులకు 13,600లు రావాల్సి ఉండగా, కేవలం 11,000వేలు మాత్రమే ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం పెరిగిన నిత్యవసర వస్తువుల ధరల వల్ల వలస కార్మికులకు కనీస వేతనం 26,000వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## ఏకలవ్య ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



హిమాయత్ నగర్ : చేవెళ్ల డిక్లరేషన్ లో ఇచ్చిన హామీ మేరకు ఏకలవ్య ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ఏకలవ్య ఎరుకల సంఘం కోరింది. ఈ మేరకు మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్‌మార్కెట్ కమిటీ డైరెక్టర్ బి.సత్యనారాయణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కోసం గెలుపు కోసం అహర్నిశలు కష్టపడిన కార్యకర్తలకే ఏకలవ్య ఎరుకల కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎరుకలను విస్మరించిందన్నారు. గత ప్రభుత్వం ఎన్నో ఇబ్బందులు ఎదురుకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత 12 ఏళ్లుగా ట్రైకార్ చైర్మన్ పదవీని లంబాడీల సామాజిక వర్గానికి పరిమితం చేశారని, ఈసారి ఎరుకల సామాజిక వర్గానికి ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో చదువుకుంటున్న ఎరుకల విద్యార్థులు నివసించడానికి ఒక హాస్టల్ నిర్మించాలని, విదేశాలలో చదువుకోవడానికి ఇచ్చే అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద ఎరుకల యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ చైర్మన్ కెంసారం ఎల్లయ్య, సీనియర్ నాయకులు శ్రీరాం శివ కుమార్, రమేష్, సత్యనారాయణ, శేఖర్, సుధాకర్, కృష్ణ, రవి మహిళా నాయకులు శ్యామల పాల్గొన్నారు.

# క్యాబ్‌లా కిసాన్ డ్రోన్ బుకింగ్!

- అందుబాటులోకి ప్రత్యేక యాప్
- వ్యవసాయ కార్యకలాపాలకు ఛార్జీలు వసూలు
- ఆర్ఎస్‌కె సిబ్బందికి టార్గెట్లు
- స్వర్ణాంధ్ర విజన్ 2047 పాలసీ నిర్దేశంలో..

అమరావతి : ఎక్కడికైనా వెళ్లాలంటే ఓలా, ఉబర్, ర్యాపిడో ఇత్యాది కంపెనీల యాప్‌లలో క్యాబ్, ఆటో, బైక్, ఇతర వాహనాలను బుక్ చేసుకోవడం తెలిసిందే. ప్రయాణ లొకేషన్లు, సమయం, దూరం, అందుకు చేసే ఛార్జి, చెల్లింపులు అన్నీ ఆన్‌లైన్‌లో సాగుతాయి. ఈ తరహాలోనే డిజిటల్ ప్లాట్‌ఫాంపై రైతులకు డ్రోన్ సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించి అమల్లో పెట్టింది. కిసాన్ డ్రోన్ యాప్, లేదంటే ఫార్మర్ యాప్ అని పిలుస్తున్నారు. ఎపి డ్రోన్స్ కార్పొరేషన్ (ఎపిడిసి) సంధానకర్తగా ఈ యాప్ నడుస్తుంది. డ్రోన్ సేవలు అందించే ప్రైవేటు కంపెనీలు ఈ యాప్‌లో తమ పేర్లు నమోదు చేసుకుంటాయి. ఎపిడిసి ఈ కంపెనీల అర్హతలు నిర్ణయించి యాప్‌లో చేరుస్తుంది. సదరు కంపెనీలు తాము అందించే సర్వీసుల వివరాలను, యూజర్ ఛార్జీలను యాప్‌లో వెల్లడిస్తాయి. ఫలాన సేవకు, ఫలాన విస్తీర్ణానికి, ఫలాన సమయానికి, ఇంత ఛార్జి అని పేర్కొంటాయి. ఎరువులు, క్రిమిసంహారక మందుల పిచికారీ, విత్తనాలు నాటడం, పంట పర్యవేక్షణ, పొలాల మ్యాపింగ్, పంట ఆరోగ్య అంచనా తదితర వ్యవసాయ కార్యకలాపాల సమాచారం కంపెనీల వారీగా యాప్‌లో నిక్షిప్తమవుతాయి. డ్రోన్ సర్వీసులు అవసరమైన రైతులు తమ మొబైల్ ఫోన్‌లో యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని తమకు నచ్చిన కంపెనీ నుంచి తమకు అవసరమైన సర్వీసుల కోసం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. రైతులు కోరిన సేవ అందించేందుకు సమ్మతిస్తే కంపెనీలు ఏ రోజు ఎన్ని గంటలకు డ్రోన్ పొలం వద్దకు చేరుకుంటుందో యాప్‌లో తెలియజేస్తాయి. ఆ ప్రకారం రైతుకు డ్రోన్ సర్వీసులు అందించి యూజర్ ఛార్జీలు వసూలు చేస్తాయి.

సంధాన కర్త ఎపిడిసి: ఆంధ్రప్రదేశ్ డ్రోన్స్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌ను 2018లోనే నెలకొల్పారు. కార్పొరేషన్‌లో వివిధ ప్రభుత్వ విభాగాలు షేర్ హోల్డర్స్,స్టేక్ హోల్డర్స్‌గా ఉన్నాయి. మోడీ ప్రభుత్వం 'వికసిత భారత్ 2047'కు కొనసాగింపుగాటిడిపి కూటమి ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర విజన్ 2047' ప్రణాళికను రూపొందించింది. సదరు విజన్ లక్ష్యంగా వచ్చే ఐదేళ్లకు డ్రోన్ పాలసీని ప్రకటించింది. డ్రోన్ సేవలను విస్తారంగా వివిధ తరగతుల ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ఎపిడిసి ప్రణాళికలు వేస్తోంది. తొలి దశలో రైతులను ఎంచుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద రైతులకు డ్రోన్ల సరఫరాతోపాటు సేవలనూ అందించేందుకు సంధాన కర్తగా వ్యవహరిస్తోంది. సబ్సిడీపై డ్రోన్లు పొందిన రైతు గ్రూపులతోపాటు డ్రోన్ సేవలందించే ప్రైవేట్ కంపెనీలను సైతం యూజర్ ఛార్జీలపై రైతులకు డ్రోన్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు యాప్‌ను తీసుకొచ్చింది.

పక్కా బిజినెస్ ఫార్ములా: ప్రైవేట్ కంపెనీలకు కస్టమర్లను గుర్తించి వారి వ్యాపారాభివృద్ధికి వ్యవసాయశాఖతో ప్రభుత్వం పనిచేయిస్తోంది.



కమిషనర్, ఉన్నతాధికారులు తమ కిందిస్థాయి అధికారులు, సిబ్బందిని అదే పనిగా వీడియో, ఆడియో కాన్ఫరెన్స్‌లలో ఉబరైజేషన్ (ఆన్‌లైన్‌లో డ్రోన్ సేవలు)కు సిద్ధం చేస్తున్నాయి. మానవ శ్రమ కొరత సమస్య పరిష్కారం, కచ్చితత్వం, జవాబుదారీతనం, సాంకేతిక పరిజ్ఞానం, త్వరితగతిన పని.. పేరిట రైతులను ఆకర్షించమంటున్నారు. ప్రతి రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కె) సిబ్బంది తమ పరిధిలోని రైతులందరితో వారి మొబైల్ ఫోన్లలో డ్రోన్ సేవల యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించాలని నిర్దేశించారు. రోజుకు ఇంతమంది రైతులతో యాప్ ఇన్‌స్టాల్ చేయాలంటూ రోజువారీగా టార్గెట్లు విధించినట్లు సమాచారం. రైతులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలంటే తప్పనిసరిగా స్మార్ట్ ఫోన్ ఉండాలి. యాప్ ఇన్‌స్టాలేషన్, బ్రౌజింగ్‌నకు నెట్ డేటా కావాలి. సెల్ కంపెనీల ద్వారా డేటా రీఛార్జి చేయించుకోవాలి. అందుకు రైతులు తమ జేబులో నుంచి కొంత అనివార్యంగా పెట్టుకోవాలి.

# కిడ్నీ వ్యాధి మూలాల అన్వేషణ

శ్రీకాకుళం, : శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో కిడ్నీ వ్యాధి మూలాల అన్వేషణ ప్రక్రియ మొదలైంది. నిపుణుల నియామకాలు, మౌలిక సదుపాయాల కల్పన పూర్తయ్యింది. విశాఖలోని కింగ్ జార్జ్ ఆసుపత్రి లో అత్యాధునిక పరికరాలతో ప్రత్యేకంగా ల్యాబ్ ను ఏర్పాటు చేశారు. ఉద్దాన ప్రాంత వాసుల నుంచి వ్యాధుల రాకకు కారణాలపై రక్త నమూనాలను సేకరిస్తున్నారు. కిడ్నీ వ్యాధుల బారినపడే అవకాశం ఉన్న వారిని ముందుగానే గుర్తించేలా మూత్ర నమూనాల పరీక్షలో 'బయో మార్కర్స్' విధానాన్ని ఈ సారి కొత్తగా అమలు చేస్తున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన ప్రశ్నావళి ద్వారా స్థానికుల నుంచి సమాధానాలు రాబడుతున్నారు. ఇప్పటివరకు ఉద్దాన ప్రాంతంలో తీసుకున్న చర్యలగురించి పరిశోధన బృందంసభ్యులు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కు నివేదించారు. ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ వ్యాధులు అధికంగా ఉన్నందున వాటి మూలాలు కనుగొనేందుకు గతేడాది నవంబరులో ఇండియన్ కౌన్సెల్ అఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్-డిపార్టుమెంట్ అఫ్ హెల్త్ రీసెర్చ్ విభాగం) మూడేళ్ల కాలపరిమితితో ప్రత్యేకంగా రూ.6.2 కోట్లను గ్రాంటు రూపంలో ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవ మేరకు ఐసిఎంఆర్ సానుకూలంగా స్పందించింది. సీనియర్ నెఫ్రాలజిస్ట్ ప్రొఫెసర్ తాతపూడి రవిరాజు మెంటార్‌గా ఆంధ్ర వైద్య కళాశాల నెఫ్రాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జి.ప్రసాద్ ప్రిన్సిపల్ ఇన్విస్టిగేటర్‌గా పరిశోధన ప్రారంభమైంది. శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులతో ప్రత్యేకంగా ఏర్పడిన బృందం ఉద్దాన ప్రాంత స్థానికులను కలుసుకుంటోంది. ఇప్పటివరకు సుమారు 1,500 మంది నుంచి రక్త, మూత్ర నమూనాలను సేకరించింది. వీటిని పలాసలోని కిడ్నీ రీసెర్చ్ కేంద్రంలో తొలుత భద్రపరిచి, ఆ తర్వాత తగిన జాగ్రత్తలతో కేజీహెచ్ లో ఉన్న ల్యాబ్ కు తరలిస్తున్నారు. ఐసీఎంఆర్ ఆమోదం తెలిపిన మేరకు విశాఖ కేజీహెచ్ లో సెంట్రిఫ్యూజ్ లు, డీప్ ఫ్రీజర్లు, శాంపిల్ స్టోరేజీ సిస్టమ్స్, అనలిటకల్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఫీల్డ్ శాంపిలింగ్ కిట్లు ఈ ల్యాబ్ లు ఉన్నాయి. సుమారు రూ.80 లక్షలతో కొనుగోలుచేసిన అత్యాధునిక పరికరాలు/ యంత్రాలను బయో సేఫ్టీ ప్రమాణాలకు ల్యాబ్ లో ఏర్పాటయ్యాయి. బయో మార్కర్స్ టెస్టింగ్ ద్వారా కిడ్నీ బాధితులను ప్రాథమిక దశలోనే అతి త్వరగా గుర్తించేందుకు వీలుందని మెంటార్ డాక్టర్ రవిరాజ్, ప్రిన్సిపల్ ఇన్విస్టిగేటర్ డాక్టర్ జి. ప్రసాద్ వెల్లడించారు. మూత్ర నమూనాలను 'బయో మార్కర్ విధానంలో పరీక్షించడంవల్ల రానున్న మూడు, నాలుగు సంవత్సరాల్లో కిడ్నీ వ్యాధుల బారినపడేందుకు అవకాశం ఉన్నట్లయితే సూక్ష్మ స్థాయిలో తెలిసిపోతుందని వివరించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మూకుమ్మడిగా ఇటువంటి పరీక్షలు చేయడం ఇదే తొలిసారి అని చెప్పారు. మూత్ర నమూనాల సేకరణలో బాధితుల కుటుంబ నేపథ్యం, ఇతర అంశాలను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఈ ఈ పరీక్షల ద్వారా రానున్న మూడు, నాలుగేళ్లలో కిడ్నీ సమస్య వచ్చే అవకాశం ఉందా? లేదా? వస్తే ఏ స్థాయిలో వచ్చేందుకు అవకాశాలున్నాయి? అన్న వాటిపై స్పష్టత వస్తుందని వైద్యులు వెల్లడించారు. ఈ ఫలితాల ఆధారంగా రోగులు తగిన జాగ్రత్తలతో వ్యవహరించేందుకు, వైద్యాన్ని అందించేందుకు సులువవుతుందని తెలిపారు. దీనివల్ల వ్యాధి ముదరకుండా... కిడ్నీలు చెడిపోకుండా ఉండేందుకు వీలుంది. ఆర్ఎన్ఏ సీక్వెన్సింగ్ విధానంలో జన్యుపరమైన పరీక్షలు కూడా ఈ పరిశోధనలో భాగంగా చేస్తామని తెలిపారు.

## హైదరాబాద్‌లో విచిత్రం..

# దశదిన కర్మ కోసం కాకి కొనుగోలు

- పురానాపూల్ శ్మశానవాటికలో విచిత్ర ఘటన
- పిండం ముట్టడానికి రాని కాకులు
- గంటల తరబడి నిరీక్షించిన కుటుంబ సభ్యులు
- చివరికి కాకిని కొనుగోలు చేసి ఆచారం పూర్తి

హైదరాబాద్: హైదరాబాద్‌లోని పురానాపూల్ శ్మశానవాటికలో ఓ విచిత్ర ఘటన చోటుచేసుకుంది. దశదిన కర్మ సందర్భంగా పెట్టిన పిండాన్ని ముట్టడానికి కాకులు రాకపోవడంతో, ఓ కుటుంబం ఏకంగా ఒక కాకిని కొనుగోలు చేసి తమ ఆచారాన్ని పూర్తి



చేసుకోవాల్సి వచ్చింది. తీవ్రమైన ఎండల ప్రభావం సంప్రదాయ కార్యక్రమాలపై కూడా ఎలా పడుతోందో ఈ ఘటన అద్దం పడుతోంది. ఇటీవల ఓ కుటుంబం పురానాపూల్ శ్మశానవాటికలో పెద్ద కర్మ కార్యక్రమం నిర్వహించింది.

ఆచారం ప్రకారం పిండ ప్రదానం చేసి కాకుల కోసం గంటల తరబడి ఎదురుచూశారు. అయితే, తీవ్రమైన ఎండల కారణంగా ఆ ప్రాంతంలో ఒక్క కాకి కూడా కనిపించలేదు. సమయం గడుస్తున్నా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. చివరికి, వారు ఓ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. సమీపంలోని ముర్గి చౌక్‌కు వెళ్లి, అక్కడ ఓ కాకిని కొనుగోలు చేసి తీసుకువచ్చారు. ఆ కాకితో పిండం ముట్టించి కార్యక్రమాన్ని పూర్తిచేశారు. ఈ ఘటన వేసవి తాపం కేవలం మనుషులనే కాకుండా పక్షులు, ఇతర జీవజాలాన్ని కూడా ఎంతలా ఇబ్బంది పెడుతోందో తెలియజేస్తోంది. హిందూ సంప్రదాయంలో పితృకార్యాల సమయంలో కాకికి పిండం పెట్టడం చాలా ముఖ్యమైంది. కాకిని పితృదేవతల రూపంగా భావిస్తారు. కాకి పిండాన్ని స్వీకరిస్తే, పితృదేవతల ఆత్మ శాంతించినట్లు, వారు సంతృప్తిగా ఉన్నట్లు నమ్ముతారు. అయితే, పిండాన్ని బలవంతంగా కాకితో ముట్టించడం శాస్త్రసమ్మతం కాదని, అది సహజంగా జరగాల్సిన ప్రక్రియ అని పండితులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పిండాన్ని ఆవుకు తినిపించడం లేదా నదిలో కలపడం వంటి ప్రత్యామ్నాయాలు కూడా ఉన్నాయని వారు సూచిస్తున్నారు.

## బాసర టూ భద్రాచలం అభివృద్ధి : మంత్రి సీతక్క

మంగపేట : ఆదిలాబాల్ జిల్లా బాసర నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం వరకు గోదావరి సర్క్యూట్ గా ప్రభుత్వం అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం మండలంలోని మల్లూరు, మంగపేట గ్రామాల్లో ప్రజాదర్బార్ కార్యక్రమం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు లేని మంగపేట మండలాన్ని 6 జోన్లుగా విభజించి ప్రజాదర్బార్లు నిర్వహించి ఆయా పంచాయతీల్లో సమస్యలను పరిష్కరించనున్నట్ల తెలిపారు. 20 సంవత్సరాలుగా మంగపేట మండలంలో ప్రజాప్రతినిధులు లేనందున స్వయంగా తానే సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని మంగపేట, మల్లూరు పంచాయతీల్లో వాటి అనుబంధంగా ఉన్న కొన్ని పంచాయతీల్లోని సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాగమే గ్రామాల్లోకి వచ్చి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. మంగపేట మండల కేంద్రంలో సంత కోసం ఫారెస్టు స్థలాన్ని కేటాయిస్తూ కలెక్టర్ ను ఆదేశించారు. నర్సాపురం బోరు నుంచి గోదావరి వరకు రైతుల కోసం రూ. 2 కోట్లతో బీటీ రోడ్డు పనులకు శంఖుస్థాపన చేశారు. మండల కేంద్రంలోని బస్టాండ్ నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తేవాలన్నారు. గోదావరి పుష్కరాలు ఉన్నందున ఏటూరు నాగారం నుంచి భద్రాచలం వరకు పుష్కరఘాట్ల నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. మంగపేట డబుల్ లేన్ రోడ్డు సెంట్రల్ లైటింగ్ డ్రైనేజీ పనులు పూర్తి చేయాలన్నారు. మంగపేట నుండి కాటాపూర్ వరకు రోడ్డు మల్లూరు హేమాచలం అభివృద్ధికి 70 కోట్లతో పర్మినెంట్ అభివృద్ధి పనులు చేసేందుకు గుర్తించినట్లు మంత్రి సీతక్క తెలిపారు. వారం రోజుల్లో ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలను తాత్కాలిక పద్ధతుల్లో నిర్వహించి బ్రహ్మోత్సవాల అనంతరం పర్మినెంట్ పనులు ప్రారంబించనున్నట్లు తెలిపారు. బాసర టూ భద్రాచలం సర్క్యూట్ లో బాగంగా గోదావరి పరివాహక ప్రాంతాల మండలాలైన గ్రామాల్లో అభివృద్ధి సంక్షేమంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టినట్లు మంత్రి సీతక్క తెలిపారు. భద్రాచలంలో5 వందల కోట్లు, బాసరలో పెద్ద ఎత్తున అభివృద్ధికి నిధులు మంజూరు, కాళేశ్వరం, మేడారం, హేమాచల లక్ష్మీనర్సింహాస్వామి ఆలయానికి నిధులు కేటాయించినట్టు తెలిపారు. ప్రజల సహకారంతో ములుగు నియోజకవర్గంలో అభివృద్ధి చేసి మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని నిర్ణయించుకున్నట్టు వెల్లడించారు. నియోజకవర్గంలోని 10 మండలాల్లో ఇందిరమ్మ, మొదటి విడతలో 5 వేల ఇండ్లు ఇచ్చానని, రెండో విడతల్లో అర్హులైన అందరికీ ఇళ్లు, పింఛన్లు, ఇవ్వడానికి కృషి చేయనున్నట్టు తెలిపారు.

## సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



కనగల్ : కనగల్ మండల పరిధిలోని ధర్వేశిపురం ప్రాంతానికి చెందిన 33 కేవీ తిమ్మన్నగూడెం ఫీడర్‌లో ఏర్పడిన సాంకేతిక లోపాన్ని ట్రాన్స్‌కో సిబ్బంది తక్షణమే గుర్తించి సరిచేశారు. సోమవారం అర్ధరాత్రి వరకు, తెల్లవారుజామున మూడు గంటల వరకు సిబ్బంది నిరంతరం మరమ్మతు పనులు చేపట్టి లోపాన్ని పూర్తిగా సరిచేశారు. అనంతరం 33/11 కేవీ దర్వేశిపురం సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో మండల ఏఈ ఆర్ఎన్జే కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యుత్ సరఫరా సాధారణంగా కొనసాగుతోందని తెలిపారు. సమస్య తలెత్తిన వెంటనే సిబ్బంది వేగంగా స్పందించి మరమ్మతులు పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎండాకాలం రాత్రి సమయం కరెంటు లేకపోవడంతో ఆయా గ్రామాల్లో ప్రజలు, చిన్నారులు ఉడకపోతతో తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు.

## కిలారు రాజేష్ కు ఎందుకంత ప్రాధాన్యం

విజయవాడ, : రాజకీయాలలో అవసరాలు మాత్రమే ఉంటాయి. ఎప్పటికీ అయ్యేది ప్రస్తుతమో అనే సామెత తీరుగానే అవి సాగిపోతుంటాయి. కానీ కొంతమంది వీటికి విరుద్ధంగా ఉంటారు. అవసరాలు కాకుండా ఆత్మీయత అనే ధోరణిలో పని చేస్తుంటారు. నాది అని కాకుండా.. మనది అనే కోణంలో అడుగులు వేస్తుంటారు. స్నేహం కోసం చివరికి తమను తాము కూడా లెక్క చేయరు. అటువంటివారు ఎటువంటి గుర్తింపును కోరుకోరు. ఎక్కడో మూలన ఉండిపోతారు. కానీ వెలుగులోకి వస్తే మాత్రం ఉదయించే సూర్యుడు కంటే ఎక్కువగా ప్రజ్వలిస్తుంటారు. ఈ ఉపమానం ఈ నాయకుడికి నూటికి నూరు శాతం సరిపోతుంది. ఆయన ఎవరు.. ఎందుకింత చర్చ జరుగుతోంది.. అనే ప్రశ్నలకు సమాధానం ఈ కథనం.ఆయన పేరు కిలారు రాజేష్. తెలుగుదేశం పార్టీలో జనరల్ సెక్రెటరీగా నియమితులయ్యారు. సాధారణంగా ఈ స్థాయికి రావాలంటే తెలుగుదేశం పార్టీలో చాలా కష్టపడాలి. చిన్న వయసులోనే ఆయనకు ఈ పదవి రావడం ఒకరకంగా వరమైతే.. ఆయన పడిన కష్టానికి లభించిన గౌరవం. నారా లోకేష్, కిలారు రాజేష్ మధ్య బలమైన స్నేహం ఉంది. వీరిద్దరూ ఒకే స్కూల్లో చదువుకున్నారు. అలా ఏర్పడిన స్నేహం చివరికి రాజకీయాలకు దారితీసింది. రాజకీయాలలో కూడా నాలా లోకేష్ కు నమ్మిన బంటుగా కిలారు రాజేష్ ను ఆవిర్భవించేలా చేసింది. 2012 లో తెలుగుదేశం పార్టీలో చేరారు రాజేష్. అప్పటికి ఇంకా తెలుగుదేశం పార్టీ అధికారం లో లేదు. తెలంగాణ ఉద్యమం వల్ల ప్రత్యేకమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ఇలాంటి స్థితిలో పార్టీలో ప్రవేశించిన రాజేష్.. నారా లోకేష్ కు నమ్మిన బంటుగా మారిపోయారు. 2014 లో ఏపీలో తెలుగుదేశం అధికారంలోకి రావడంలో రాజేష్ కీలకపాత్ర పోషించారు. ముఖ్యంగా యువతను పార్టీకి దగ్గరగా చేశారు. నారా లోకేష్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత కిలారు రాజేష్ కీలకంగా వ్యవహరించారు. 2019లో పార్టీ ఓడిపోయిన తర్వాత రాజేష్ మరింత పట్టుదలతో పనిచేయడం మొదలు పెట్టారు. చంద్రబాబు జైలుకు వెళ్లడం తో లోకేష్ మీద ఒత్తిడి పెరిగిపోయింది.. ఈ నేపథ్యంలో నారా లోకేష్ కు అండగా నిలబడ్డారు రాజేష్. పార్టీ పెద్దలతో మంతనాలు జరిపారు. ఏపీలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు నారా లోకేష్ కు వివరించారు. వైసిపి చేస్తున్న కుట్రలను ఎప్పటికప్పుడు ఎండగట్టారు. తెర ముందుకు రాకపోయినప్పటికీ.. తెరవెనుక ఎంత చేయాలో అంతచేశారు రాజేష్. నారా లోకేష్ యువగళం పేరుతో చేసిన పాదయాత్రకు కర్త కర్మ క్రియ రాజేష్ అంటే అతడి స్థాయి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. 3000 కిలోమీటర్ల పాటు లోకేష్ పాదయాత్ర జరిగితే.. ప్రారంభం నుంచి చివరి వరకు రాజేష్ ఆయన వెంట ఉన్నారు. ప్రజా సమస్యలను గుర్తించడంలో.. ప్రజలకు నారా లోకేష్‌ను మరింత చేరువ చేయడంలో రాజేష్ కీలక పాత్ర పోషించారు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ రాజేష్ ఎటువంటి పదవిని కోరుకోలేదు. అధికారంలో లేనప్పుడు ఎలా అయితే ఉన్నారో.. ఇప్పుడు కూడా అలానే ఉన్నారు.అతడి నిరాడంబరతను గుర్తించిన పార్టీ సుప్రీమ్ చంద్రబాబు నాయుడు.. జనరల్ సెక్రటరీ పదవితో అతడి సేవలను గుర్తించారు.. దీంతో రాజేష్ సేవలను మరింత ఉపయోగించుకోవాలని చంద్రబాబు భావించి ఈ పదవి కట్టబెట్టారు. జనరల్ సెక్రెటరీ పదవి వచ్చినప్పటికీ రాజేష్ డౌన్ టు



ఎర్త్ లాగానే ఉన్నారు. నారా లోకేష్ కు నమ్మిన బంటు లాగానే సాగుతున్నారు..విలువలు పాటించే వారికి పదవి అవసరం లేదు. పార్టీ మాత్రమే ముఖ్యం అనుకునే వారికి ఎటువంటి హోదా అవసరం లేదు. కొంతమంది ముందు గౌరవం కూడా తగ్గిపోతుంది. పదవి కూడా తన స్థాయి తగ్గించుకుంటుంది. ఎందుకంటే మహోన్నతమైన వ్యక్తిత్వం ముందు మిగతావన్నీ చిన్న ఇసుక రేణువుల మాదిరి లాంటివే కదా.. ఈ ఉపమానం నూటికి నూరు శాతం కాదు కోటి శాతం కిలారు రాజేష్ కు వర్తిస్తుంది.

## టార్గెట్ వైసీపీ...

కాకినాడ, : డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తమ పార్టీ నేతలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని గట్టిగా ఎదుర్కోవాలని సూచించారు. పార్టీ అధికార ప్రతినిధులతో సమావేశమైన పవన్ వారికి కీలక సూచనలు చేశారు. తాను ఒక్కడినే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవడం కాదు.. మిగతా పార్టీ నేతలు కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని కూడా సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విమర్శలకు ఇచ్చి పడేయాలని సూచించారు. అలాగని ఇష్టారాజ్యంగా మాట్లాడవద్దని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల మాదిరిగా బూతులు వద్దని సూచించారు. కూటమి పార్టీలో జనసేన ఒక భాగస్వామ్యం అని.. కూటమి అంటే ఒక్క తెలుగుదేశం మాత్రమే కాదు అని.. అందుకే ప్రభుత్వం పై విమర్శలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తే గట్టిగానే బదులు ఇవ్వాలని పవన్ కళ్యాణ్ తాజాగా ఆదేశాలు ఇవ్వడం విశేషం.కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతోంది. మరో మూడేళ్ల గడువు మాత్రమే ఉంది. కూటమి కలిసికట్టుగా 15 సంవత్సరాలు పాటు ఉండాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. అయితే జనసేనలో పవన్ ఒక్కరే మాట్లాడుతున్నారన్న విమర్శ ఉంది. పైగా కూటమిలో జనసేన నేతలు అంత కంఫర్ట్ గా లేరన్న కామెంట్స్ కూడా ఉన్నాయి. వాటిని ఎప్పటికప్పుడు చెక్ చెబుతూ వచ్చారు పవన్ కళ్యాణ్. కనీస స్థాయిలో కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఛాన్స్ ఇవ్వదలుచుకోలేదు. ముఖ్యంగా రెండు పార్టీల మధ్య చిచ్చుపెట్టేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేయని ప్రయత్నం లేదు. జనసేన నేతలతోనే ఈ ప్రయోగాలు చేసి విఫలమైంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అటువంటి నేతలను పవన్ కళ్యాణ్ సాగనంపేసారు కూడా. చాలామంది నేతలు బయటకు వెళ్లిపోయారు. అది కూడా పవన్ కళ్యాణ్ హెచ్చరికతోనే. ఇష్టం ఉంటే ఉండండి.. లేకపోతే వెళ్లిపోండి అని పవన్ సూచించేసరికి.. టిడిపితో చిచ్చు పెట్టాలనుకున్న నేతలంతా జనసేనను విడిచిపెట్టి వెళ్లిపోయారు.అయితే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మొన్నటి





ఎన్నికలకు ముందు, తరువాత, ఇప్పుడు అదే స్టాండ్ తో ముందుకు వెళ్తున్నారు. ఎక్కడ వెనక్కి తగ్గిన దాఖలాలు లేవు. ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీతో పొత్తు వద్దని చాలామంది నేతలు వాదించారు. అటువంటి నేతలను లెక్క చేయలేదు.

వెళ్ళిపోతే వెళ్ళిపోవచ్చు అని సూచించేసరికి అప్పట్లో కొంతమంది బయటకు వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా చాలామంది నేతలు చిచ్చుపెట్టే ప్రయత్నం చేశారు. అటువంటి వారికి కూడా చెక్ పెట్టేశారు పవన్ కళ్యాణ్. అయితే ఇప్పటికీ కొంతమంది జనసేన నేతల వైఖరి మారడం లేదు. తెలుగుదేశం పార్టీతో సమన్వయం చేసుకునేందుకు ఇష్టపడడం లేదు. ప్రభుత్వం అంటే కేవలం ముఖ్యమంత్రి పదవి అన్నట్టు ఉంది కొంతమంది నేతల అభిప్రాయం. అందుకే కూటమితో మమేకమై పని చేయలేకపోతున్నారు. అటువంటి వారికి గట్టి హెచ్చరికలు పంపారు పవన్ కళ్యాణ్. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏమైనా తప్పుడు మాట్లాడితే గట్టిగానే రిప్లై ఇవ్వండి.. పదునైన మాటలతో దాడి చేయండి కానీ బూతులు మాట్లాడవద్దని చెప్పారు పవన్. ఇకనైనా జనసేన నేతలు గట్టిగా మాట్లాడతారా? లేదా? అన్నది చూడాలి.

## బీటెక్ రవీకి తిప్పలు తప్పవా



కడప, : పులివెందుల నియోజకవర్గం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రత్యేక స్థానం కలిగి ఉంది. ముఖ్యంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కు ఇది బలమైన కోటగా పేరుంది. ఈ నేపథ్యంలో ఈ నియోజకవర్గంలో జగన్‌ను ఓడించడం తెలుగుదేశం పార్టీ ప్రధాన లక్ష్యంగాపెట్టుకుంది. గత ఎన్నికల సమయంలోనే ఈ సీటుపై టిడిపి గట్టిగా దృష్టి పెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ ప్రభావం తగ్గినా, పులివెందులలో మాత్రం జగన్‌కు ఉన్న పట్టు స్పష్టంగా కనిపించింది.వచ్చే ఎన్నికల నాటికి ఎట్టి పరిస్థితుల్లోనైనా ఈ నియోజకవర్గాన్ని తమవైపు తిప్పుకోవాలని టిడిపి వ్యూహాలు రచిస్తోంది. దీనికోసం అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తోంది. ముఖ్యంగా రైతులకు సాగునీటి సదుపాయం అందించేందుకు చర్యలు చేపడుతోంది. పట్టిసీమ ప్రాజెక్ట్ నుంచి కూడా నీటిని పులివెందులకు చేరవేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అదే సమయంలో ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా మెరుగైన సేవలు అందించాలని ప్రభుత్వం కృషి చేస్తోంది.అయితే, కేవలం అభివృద్ధి పనులు మాత్రమే సరిపోవని టిడిపి నాయకత్వం భావిస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని పెంచడం, కార్యకర్తలను చైతన్యపరచడం కూడా అంతే ముఖ్యమని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే పులివెందుల ఇన్చార్జ్‌గా ఉన్న బీటెక్ రవి ( పనితీరుపై పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల కడప పర్యటనలో ఆయన రవికి నేరుగా సూచనలు చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ఇంకా, మంత్రి నారా లోకేష్కూడా పార్టీ పరిస్థితిని సమీక్షించినప్పుడు పులివెందులలో పనితీరు ఆశించినంతగా లేదని ప్రస్తావించినట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో విజయాన్ని లక్ష్యంగా పెట్టుకున్నప్పుడు ఇప్పటి నుంచే కఠినంగా శ్రమించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి కొంతమేర విజయం సాధించింది. ముఖ్యంగా ఎంపీటీసీ ఎన్నికల్లో గెలుపు సాధించడం, అలాగే బీటెక్ రవి కుటుంబానికి చెందిన అభ్యర్థి విజయం సాధించడం పార్టీకి కొంత ఉత్సాహాన్ని ఇచ్చింది. దీంతో నియోజకవర్గంలో తమ ప్రభావం పెరుగుతోందని టిడిపి భావిస్తోంది.అయితే, పులివెందులలో వైఎస్ కుటుంబానికి ఉన్న అనుబంధం, అభిమాన వర్గం ఇప్పటికీ బలంగా ఉంది. ఈ కారణంగా అక్కడ రాజకీయ పరిస్థితులు అంత సులభంగా మారే అవకాశం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అందుకే నిరంతరం ప్రజల మధ్య ఉండటం, పార్టీ కార్యకలాపాలను బలోపేతం చేయడం అత్యంత కీలకమని టిడిపి నాయకత్వం భావిస్తోంది. ఈ పరిస్థితుల్లో బీటెక్ రవి మరింత చురుకుగా వ్యవహరించి పార్టీ లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. లేకపోతే వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడం కష్టసాధ్యమవుతుందని రాజకీయ పరిశీలకులు సూచిస్తున్నారు. పులివెందులలో వచ్చే ఎన్నికలు ఆసక్తికర పోరాటానికి వేదిక కావడం ఖాయం అని చెప్పవచ్చు.

## ప్రైవేట్ వీడియోలతో బాలికలు, యువతుల్ని బ్లాక్ మెయిల్

హైదరాబాద్, : సోషల్ మీడియా వేదికగా చేసుకుని బాలికలు, యువతులను మోసం చేస్తున్న కోదూరి చంద్రశేఖర్ ఆజాద్ అలియాస్ అర్జున్ ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఖరీదైన కార్లు, పబ్‌లలో దిగిన ఫొటోలను చూపిస్తూ తాను రిచ్ ఫ్యామిలీకి చెందినవాడినని నమ్మించి చాటింగ్ ద్వారా అమ్మాయిలకు దగ్గరయ్యేవాడు. తరువాత ప్రేమ పేరుతో లోబరుచుకుని వారితో ఏకాంతంగా గడిపిన వీడియోలు, ఫొటోలతో బ్లాక్ మెయిల్ చేసి డబ్బు గుంజుతున్నట్లు గుర్తించారు. గడిచిన రెండేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 20 మందికి పైగా యువతులను అర్జున్ మోసం చేసినట్లు తెలుస్తోంది. బాధిత యువతుల ఫిర్యాదుతో నిందితుడిపై మరో 3 కేసులు నమోదు చేశారు. మరో కేసును నార్సింగి పీఎస్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. జూబ్లీహిల్స్ సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్సై వినోద్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు.

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం చామల్లమూడికి చెందిన ఆజాద్ అలియాస్ అర్జున్ ప్రస్తుతం మియాపూర్‌లో ఉంటున్నాడు. ధనవంతుల ఇళ్లల్లో పనిచేసే డ్రైవర్స్, వాచ్‌మెన్, ఇతర సిబ్బందితో పరిచయం పెంచుకుని వారికి కొంత నగదు ఇస్తూ ఆ ఇంట్లోని బాలికలు, యువతుల్ని ట్రాప్ చేసేవాడు. నిందితుడు అర్జున్ కేవలం సోషల్ మీడియా చాటింగ్‌కే పరిమితం కాలేదు. బాలికలు, యువతులతో ఏకాంతంగా ఉన్న గడిపిన సమయంలో రహస్యంగా ఫొటోలు, వీడియోలు తీసేవాడు. తనతో శారీరక సంబంధం పెట్టుకున్న వారికి ఆ ప్రైవేట్ వీడియోలు చూపించి బాధితులను బ్లాక్ మెయిల్ చేసేవాడు. వారి వద్ద నుంచి వేల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసేవాడు. జూబ్లీహిల్స్‌కు చెందిన ఒక 15 ఏళ్ల బాలికకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమయ్యాడు. తరువాత మాయమాటలతో బాలికను లోబరుచుకున్నాడు. రాత్రివేళ ఎవరూ లేని సమయంలో ఇంటికెళ్లి బాలికను కలిసేవాడు. ఇది గమనించిన బాలిక తల్లి ఫిర్యాదుతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోక్సో కేసులో జైలుకు వెళ్లినా, బయటకు వచ్చాక మళ్లీ ఆ బాలికను వేధించాడు. వారి డ్రైవర్ కృష్ణ, అతడి భార్య సరస్వతి సెల్‌ఫోన్లలో ఆ బాలిక నిందితుడు అర్జున్‌తో తరచుగా మాట్లాడేది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమెతో నిందితుడు ఏకాంతంగా గడిపేవాడు. ఈ విషయం ఇంట్లోవాళ్లకు చెబుతానంటూ డ్రైవర్ భార్య బాలికను బెదిరించింది. మరోవైపు అర్జున్ కూడా బెదిరించడంతో ఇంట్లో దాచిపెట్టిన రూ.29 లక్షల నగదును చోరీ చేసిన బాలిక తనను బ్లాక్ మెయిల్ చేస్తున్న అర్జున్‌కు రూ.13 లక్షలు ఇవ్వగా, డ్రైవర్ భార్య సరస్వతికి 10 లక్షలు ఇచ్చినట్టు ఫిర్యాదు చేశారు. నార్సింగికి చెందిన మరో యువతిని కూడా నిందితుడు మోసం చేశాడు. గుంటూరులో కాలేజీలో చేరేందుకు వెళ్లిన ఆమెను హోటల్‌కు తీసుకెళ్లి శారీరకంగా కలిశాడు. తరువాత పలుమార్లు ఇద్దరూ పబ్‌లు, హోటళ్లకు వెళ్లారు. ఆ తరువాత ప్రైవేట్ వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించి ఆమె నుంచి గోల్డ్ చైన్ కాజేశాడు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారో ఓ కంట కనిపెట్టాలని, వారి చర్యలు కొంచెం భిన్నంగా, అనుమానంగా కనిపిస్తే విషయాలు ఆరాతీయాలని లేకపోతే దారుణాలు జరిగే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరించారు.

### జాతీయ సివిల్ సర్వీసుల దినోత్సవం

**సివిల్ సర్వెంట్లకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు**

హైదరాబాద్: జాతీయ సివిల్ సర్వీసుల దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దేశానికి అంకితభావంతో, చిత్తశుద్ధితో సేవలందిస్తున్న సివిల్ సర్వెంట్లందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. నిజాయితీ, క్రమశిక్షణ, ప్రజాసేవ పట్ల అచంచల నిబద్ధతతో వారు నిర్వర్తిస్తున్న బాధ్యతలు దేశ అభివృద్ధి, పురోగతికి దృఢమైన పునాదిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం విధానాల రూపకల్పన, అమలులో సివిల్ సర్వెంట్లు పోషిస్తున్న కీలక పాత్రను కొనియాడుతూ, వారి నిరంతర సేవ సమాజానికి స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి అభినందించారు.

## అన్నం, సాంబార్, కూరగాయలే..

## హైకార్బ్ ఫుడ్‌తోనే బాడీబిల్డింగ్..

చెన్నై : ఇన్‌స్టాలో ఉన్న ఈ వీడియో మీరు చూడాల్సిందే. ఇతనో నిర్మాణ రంగ కార్మికుడు. అతని ఫిట్‌నెస్ చూశారా? అతనెలా ఆ షేప్ తెచ్చుకున్నాడో తెలిస్తే షాక్ అవ్వాల్సిందే. చెన్నైలో పనిచేసే ఈ కార్మికుడు తినేది చాలా సింపుల్ ఫుడ్. హై కార్బ్ డైయిట్‌నే అతను తింటున్నాడు. అతని మెనూలో ప్రోటీన్ రిచ్ ఫుడ్ ఏదీ లేదు. చాలా ఆకట్టుకునేరీతిలో అతని బాడీ షేప్ తయారైంది. అయితే కాంటెంట్ క్రియేటర్ జయచంద్రన్ అతని వీడియో తీశాడు. అతని బాడీ బిల్డింగ్ రహస్యం ఏంటో తెలుసుకున్నాడు. వర్కౌట్ ఎలా ఉంటుందో కనుకొన్నాడు. ఈటింగ్ హ్యాబిట్స్ గురించి ఎంక్వైరీ చేశాడు. రోజూ ఎండలో పనిచేసే ఈ కార్మికుడు అయిదు రోజుల వర్కౌట్ ప్లాన్‌లో ఉన్నాడు. పని భారం ఎంత ఉన్నా.. వారానికి కనీసం 5 రోజులు అతను వర్కౌట్ చేస్తాడు. సోమవారం చెస్ట్ వర్కౌట్, మంగళవారం షోల్డర్ వర్కౌట్, బుధవారం బ్యాక్ వర్కౌట్, గురువారం బైసెప్స్, ట్రైసెప్స్, ఇక శుక్రవారం లెగ్ వర్కౌట్ చేస్తానన్నాడు. అయితే కార్మికుడు కావడం వల్ల ఎక్కువగా లెగ్ వర్కౌట్‌ను సీరియస్‌గా చేయబోనన్నారు. ఎందుకంటే తెల్లవారితే మళ్లీ పనికి వెళ్లాల్సి ఉంటుంది కాబట్టి ఆ ప్రెజర్ తీసుకోనన్నాడు. రోజంతా పనిచేయాలంటే కార్బో డైట్ తప్పనిసరి. అందుకే అతను పెద్దగా ప్రోటీన్ డైయిట్‌పై ఆధారపడడం లేదు. రోజువారీ మెనూలో అన్నం, అరటిపండ్లు, గంజి ఉంటాయి. తన మెనూలో ఇడ్లీ, దోశ ఉండదన్నారు. తెల్ల అన్నంతో పాటు సాంబారు, రసం, కూరగాయలు ఎక్కువగా తీసుకుం టాడు. బీట్‌రూట్, క్యారెట్‌తో పాటు కూరగాయలతో చేసిన వంటలను ఎక్కువగా అతను ప్రిఫర్ చేస్తాడు. మూడు పూటలు అతను తెల్ల అన్నమే తింటాడట. చాలా అరుదుగా మాత్రమే పండ్లు తింటానన్నా డు. వారానికి ఓ సారి మాత్రమే మాంసాహారం తింటాడట. కేవలం మటన్ మాత్రం తింటాడు. చేపలు, కోళ్లు ముట్టుకోనన్నాడు. బాడీ షేప్ రావడానికి తానేమీ స్టిరాయిడ్స్ వాడడం లేదన్నాడు. రోజుకు ఏడు గంటలు నిద్రపోతాడట. కేవలం ఇంట్లనే వండిన వంటనే సేవిస్తాడు. అతని లిస్టులో స్మోకింగ్ కానీ, డ్రింకింగ్ కానీ లేదు.





### దస్తగిరి హత్యపై ప్రభుత్వం సీరియస్

**నిత్యానంద రెడ్డి కోసం పోలీసుల గాలింపు**

కడప, ఏప్రిల్21 :నగరంలో జరిగిన వైసీపీ కార్యకర్త పెద్దదస్తగిరి హత్య కేసుపై ప్రభుత్వం సీరియస్ అయింది. పోలీసులు లోతుగా విచారణ చేస్తూ కేసును అన్ని కోణాల నుంచి పరిశీలిస్తున్నారు. హత్య వెనుక ఉన్న కారణాలను బయటపెట్టడానికి ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. దస్తగిరి హత్యతో సంబంధం ఉన్న వైసీపీ నేత, మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. నిత్యానంద రెడ్డిని వీలైనంత త్వరగా అరెస్ట్ చేసి విచారించాలని పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.హతుడు పెద్దదస్తగిరి ఇంట్లో నిర్వహించిన తనిఖీల్లో వైసీపీ నేతలకు సంబంధించిన కీలక డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 145 ఎకరాల భూములకు సంబంధించిన పత్రాలు ఉన్నాయి. ఈ భూముల మొత్తం విలువ 100 కోట్ల రూపాయలకు పైగా ఉందని పోలీసు వర్గాలు తెలిపాయి. మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి నివాసంలో గత రాత్రి నాలుగు గంటల పాటు పోలీసులు తనిఖీలు చేపట్టారు. పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులు చేపట్టిన విచారణతో వైసీపీ నేతల్లో టెన్షన్ నెలకొంది.

## చిన్నం చెరువు అలుగు నాలా సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం

### ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే.



కుత్బుల్లాపూర్ (తెలంగాణ వాణి) సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) దుండిగల్ సర్కిల్ పరిధి బౌరంపేట్ డివిజన్ పరిధిలోని మల్లంపేట్ చిన్నం చెరువు అలుగు నాలా సమస్యను, పరిష్కరించేందుకు దాదాపు 9.80 కోట్ల రూపాయలతో నూతనంగా చేపట్టనున్న నాలా నిర్మాణ పనులతో తలెత్తనున్న సమస్యలను, స్థానికులు స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ , దృష్టికి తీసుకురాగా శంభీపూర్ రాజు, వివేకానంద్ ,వివిధ విభాగాల అధికారులతో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ వరద నీటితో ముంపుకు గురవుతున్న కాలనీల ముంపు సమస్య - పరిష్కారంలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వరద నీటితో ముంపుకు గురవుతున్న ప్రాంతాల్లో తీవ్రతను తగ్గించే దిశగా చర్యలు చేపట్టి వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రయోజనాలే తమ ప్రాధాన్యతనని, అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ప్రతిపాదిత నాలా నిర్మాణం వల్ల ఎక్కువగా ఆస్తినష్టం జరిగే పరిస్థితి ఉన్నందున గ్రామం శివారు నుంచి కాకుండా పూర్వపు నాలా ద్వారానే నీటి ప్రవాహ దిశకు అనుగుణంగానే కాలువ నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించాలన్నారు. గ్రామస్తుల ఆందోళన మాకు తెలుసని ఈ సమస్యను ఉన్నతాధికారులతో చర్చించి సమస్యను అందరి ఆమోదంతో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండీఏ లేక్స్, ఇరిగేషన్, మున్సిపల్, హైడ్రా విభాగాలకు చెందిన పలువురు అధికారులు, ప్యాక్స్ చైర్మన్ మిద్దల బాల్ రెడ్డి, నిజాంపేట్ మాజీ కార్పొరేటర్ రవి తదితరులు పాల్గొన్నారు.

# తమిళ భవిష్యత్ కోసం ఎన్డిఏకు ఓటేయండి

**పూర్వవైభవం రావాలంటే మార్పు రావాలి**

**మోడీ నేతృతత్వంలో దేశానికి సమర్థ నాయకత్వం**

**ఎన్డిఎ నేతలతో చంద్రబాబు మీడియా సమావేశం**




చెన్నై,ఏప్రిల్21:తమిళ ప్రజల భవిష్యత్తు కోసం తానే స్వయంగా చెన్నైకి వచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. దేశాభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోదీ ముందు చూపుతో ఆలోచిస్తారని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏకు ఓటు వేయాలని ఆయన కోరారు. తమిళనాడుకు పూర్వ వైభవం రావాలంటే ఎన్డీయే కూటమిని గెలిపించాలి. దేశానికి నరేంద్ర మోదీ వంటి సమర్థ నాయకత్వం ఉంది. సరైన సమయంలో మంచి ఆలోచన చేయాలని తమిళనాడు ప్రజలను కోరుతున్నా. సమర్థులను ఎన్నుకుంటే బంగారు భవిష్యత్తు ఉంటుందని చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు దేశంలో చెన్నై కీలక స్థానంలో ఉందని.. ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. నగర అభివృద్ధి గణనీయంగా మందగించిందని.. చెన్నై ఎయిర్‌పోర్టు పరిస్థితి సంతృప్తికరంగా లేదన్నారు. బెంగళూరు, హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందాయని.. ఐటీ, మౌలిక వసతులు, పెట్టుబడుల విషయంలో ముందున్నాయని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. తమిళనాడులో సీఎం చంద్రబాబు పర్యటన రెండో రోజు కొనసాగుతోంది. ఎన్డీఏకి మద్దతు కోరుతూ చెన్నైలో చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. మీడియా సమావేశంలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తమిళనాడు ఎన్డిఏ నేతలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..'తమిళనాడుకు గొప్ప చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉంది. ఒకప్పుడు చెన్నై ప్రధాన కేంద్రంగా సినీ పరిశ్రమ, ఉద్యోగ అవకాశాలు విస్తారంగా ఉండేవి. నా వివాహం కూడా ఇక్కడే జరిగింది. ఈ నగరంతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఏపీజే అబ్దుల్ కలాం, ఎంఎస్ స్వామినాథన్, అన్నాదురై వంటి మహానుభావులు తమిళనాడులో జన్మించారు. దేశానికి గొప్ప మేధావులను ఈ రాష్ట్రం అందించింది. కానీ, ప్రస్తుతం చెన్నైలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి దెబ్బతింది. మహిళలపై నేరాలు సుమారు 59 శాతం మేర పెరిగాయి. కస్టోడియల్ డెత్ కేసులూ పెరిగాయి. నకిలీ మద్యం ఘటనలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. చెన్నై ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో పెద్దగా మార్పు కనిపించడం లేదు. 1995 నుంచి చాలా రోడ్లు అలానే ఉన్నాయి. వర్షాలు పడితే నగరంలో రోడ్లు మునిగిపోతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. ?తమిళనాడుకు కేంద్రం నుంచి సమృద్ధిగా నిధులు వచ్చాయి. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు ఎంజీ రామచంద్రన్ పేరు పెట్టింది కేంద్ర ప్రభుత్వమే. ?హైస్పీడ్ రైలు ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్రాభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారుతాయి. ప్రకాశవంతమైన భవిష్యత్, మంచి ఉద్యోగ అవకాశాలు కావాలంటే ప్రజలు ఈసారి జాగ్రత్తగా, తెలివిగా ఓటు వేయాలి. డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఆంధప్రదేశ్‌లో విజయవంతంగా కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర సమన్వయం ఉంటే అభివృద్ధి వేగంగా జరుగుతుంది. కేవలం రాజకీయ కారణాలతో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా వెళ్లకూడదు. రాజకీయ లాభాల కోసం రాష్ట్రానికి నష్టం చేయడం సరైంది కాదు. అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉంది. ప్రధాని మోదీకి సహకరించి దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలి. పార్లమెంట్‌లో డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లులను కాంగ్రెస్, డీఎంకే పార్టీలు అడ్డుకున్నాయి. మహిళలకు రావాల్సిన ప్రాతినిధ్యాన్ని అడ్డుకుని ద్రోహం చేశాయి. దక్షిణాది రాష్ట్రాలకు లెక్కల ప్రకారం సీట్లు తగ్గుతాయని ప్రచారం జరుగుతోంది. కానీ వాస్తవానికి సీట్లు పెరుగుతాయి. బిల్లులో స్పష్టంగా సీట్ల పెంపు గురించి పేర్కొన్నారు. తమిళనాడులో ప్రస్తుతం 39 సీట్లు ఉండగా.. 59కి పెరిగే అవకాశం ఉంది. ఆంధప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోన్రూ పార్లమెంట్ సీట్లు పెరుగుతాయి. డీలిమిటేషన్ పక్రియలో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదు. సమతుల్యమైన ఫార్ములాతోనే సీట్ల పునర్విభజన జరుగుతుంది. కానీ ప్రస్తుత జనగణన ఆధారంగా చూస్తే దక్షిణాది రాష్ట్రాలు వెనుకపడే ప్రమాదం ఉంది. ఆర్థిక సంస్కరణల వల్లే దక్షిణాది రాష్ట్రాలు అభివృద్ధిలో ముందంజలో ఉన్నాయి. పర్ క్యాపిటా ఆదాయం గణనీయంగా పెరిగింది. నేను కూడా ద్రవిడ వ్యక్తినే. దక్షిణాది అభివృద్ధి పట్ల నాకు ప్రత్యేక దృష్టి ఉంది. ??ముందుచూపు ఉన్న నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ. దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లే విజనరీ లీడర్ మోదీ. ఈసారి ఎన్నికల్లో ఎన్డీయేకే మద్దతు తెలుపుదాం' అని చెప్పుకొచ్చారు. కేంద్రంలో మోదీ నేతృత్వంలో బలమైన ప్రభుత్వం అధికారంలో ఉంది. కేంద్రం ఉదారంగా నిధులు ఇస్తున్నప్పుడు వినియోగించుకోవాలి కదా. సంక్షేమ కార్యక్రమాల కోసం చెన్నైకి కేంద్రం రూ.14 లక్షల కోట్లు ఇచ్చింది. కేంద్ర నిధులను దారి మళ్లించడం సమంజసమా అని చంద్రబాబు ప్రశ్నించారు.

# వైసిపి రాజకీయ పార్టీ కానేకాదు

**రాజకీయ హత్యలకు డెన్‌గా మారింది**

**పార్టీ అనుమతులపై ఇసి ఆలోచన చేయాలి**

**దస్తగిరి హత్యతో వైసిపి నైజం మరింత బయటపడింది**

**మంత్రి కొలుసు పార్థసారథి సంచలన వ్యాఖ్యలు**



అమరావతి, ఏప్రిల్21 : వైసీపీ రాజకీయ పార్టీ కాదని.. హత్య రాజకీయాలకు డెన్‌గా తయారైందని ఆంధ్రప్రదేశ్ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజకీయ పార్టీగా కొనసాగే అర్హత వైసీపీకి లేదని ధ్వజమెత్తారు. ఆ పార్టీ అనుమతులపైన ఎలక్షన్ కమిషన్ కూడా ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. వైసీపీ కార్యకర్త పెద్ద దస్తగిరి హత్య వెనక ఆ పార్టీ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. ఐదేళ్ల అధికారాన్ని అడ్డుపెట్టుకొని దోచుకోవడం, దాచుకోవడమే జగన్ పార్టీ చేసిందని విమర్శించారు. మంగళవారం అమరావతి వేదికగా మంత్రి పార్థసారథి మీడియాతో మాట్లాడారు. చీకట్లో చంపడం.. పగలు వెళ్లి పరామర్శించడం వైసీపీ నేతలకు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. పెద్ద దస్తగిరి ఇంట్లో వందల కోట్ల విలువ చేసే డాక్యుమెంట్లు దొరికాయని మంత్రి కొలుసు పార్థసారథి ప్రస్తావించారు. జగన్ మేనమామ, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న ఆస్తుల డాక్యుమెంట్లు, హత్యకు గురైన పెద్ద దస్తగిరి ఇంట్లో ఎలా లభించాయని ప్రశ్నించారు. హత్యకు గురైన పెద్ద దస్తగిరి.. కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డికి అత్యంత ముఖ్యుడని చెప్పుకొచ్చారు. ఆస్తులు, అధికారం కోసం వైసీపీ నేతలు ఎంతకైనా దిగజారుతారని విమర్శించారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య నుంచి, పెద్ద దస్తగిరి హత్య వరకు వైసీపీ ఒకే తరహా నాటకమాడుతోందని ఎద్దేవా చేశారు. పెద్ద దస్తగిరి హత్యకు ప్రధాన కారకులైన వారు.. ఇప్పుడు మొసలికన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. వైసీపీ నేతలు చేసిన పాపాలను ప్రజలు క్షమించరని హెచ్చరించారు. వైసీపీని ఒక రాజకీయ పార్టీగా ప్రజలు చూడటం లేదని.. రాజకీయాల్లో కొనసాగే అర్హత ఆ పార్టీకి లేదని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ధనదాహం, అధికారదాహానికి ఎవరు అడ్డొచ్చినా తల్లైనా, చెల్లైనా, బాబాయ్ అయినా ఎవరైనా ఒకటేనని ఎద్దేవా చేశారు. జగన్ క్రిమినల్ రాజకీయాలు చేస్తున్నారనే విషయాన్ని.. వైసీపీ కార్యకర్తలు ఇప్పటికైనా ఆలోచించాలని అన్నారు. పెద్ద దస్తగిరి హత్య, బాబాయ్ హత్య, జగన్ కారు చక్రాల కింద నలిగిన కార్యకర్త ఇలా ఎన్నో ఉదాహరణలు జగన్ నైజాన్ని బహిర్గతం చేస్తున్నాయని తెలిపారు. జగన్ సన్నిహితుడు నిత్యానంద రెడ్డి సొంత పార్టీకి చెందిన దస్తగిరిని హత్య చేయటం జగన్ స్వార్థాన్ని తెలుపుతోందన్నారు. తాడేపల్లిలో తనకున్న అనుబంధంలో భాగంగానే దస్తగిరి హత్య జరిగిందని ఆరోపించారు. హింసా రాజకీయాలు నడిపే వారికి రాష్ట్రంలో చోటు లేదని అన్నారు. ఆంధప్రదేశ్ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి.. వైసీపీకి ఏపీలో చోటు లేకుండా చేయాలని మంత్రి సూచించారు.

# ప్రణాళికాబద్ధంగా ఎస్ఐఆర్ మ్యాపింగ్ పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి బ్యూరో (తెలంగాణ వాణి) జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, సమయపాలనతో అమలు చేస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏ ఈ ఆర్ వో లు,బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), సూపర్వైజర్లు, సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు సుమారు 70 శాతం ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన 30 శాతం పనులను అత్యంత ప్రాధాన్యంతో వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నియోజకవర్గాల వారీగా, మండలాల వారీగా, పోలింగ్ బూతుల వారీగా మ్యాపింగ్ పురోగతిని సమగ్రంగా విశ్లేషిస్తూ, ప్రతి ప్రాంతంలో పనుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. మణుగూరు మండలంలో కేవలం 37 శాతం మాత్రమే మ్యాపింగ్ పూర్తవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, ఆలస్యానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పట్టణ ప్రాంతంలో ఉద్యోగస్తులు బదిలీ అవ్వడం లేదా వేరొక చోటకి వెళ్లి స్థిరపడటం వంటి కారణాలతో మ్యాపింగ్ ప్రక్రియ ఆలస్యమైందని త్వరితగతిన పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, ప్రతి బీఎల్ఓకు రోజువారీ లక్ష్యాలను నిర్దేశించి, వాటి అమలుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులు సక్రమంగా పర్యటిస్తూ, ప్రతి గృహానికి చేరుకుని ఖచ్చితమైన వివరాలను సేకరించి మ్యాపింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్ శాతం తక్కువగా ఉన్న మండలాలు, పోలింగ్ బూతుల వారీగా ప్రత్యేక దృష్టి సారించి, పనిలో జాప్యానికి గల కారణాలను గుర్తించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. అవసరమైన సిబ్బంది, సాంకేతిక లేదా ఇతర సహకారం అవసరమైతే ఆలస్యం చేయకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మ్యాపింగ్ ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం తప్పనిసరిగా పాటించాలని, ఎటువంటి లోపాలు లేకుండా పూర్తి స్థాయిలో డేటా నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సాధా బైనమా దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. ఈ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా వేగవంతమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేసి, ప్రజలకు త్వరితగతిన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# బాధ్యతాయుతంగా జనగణన పూర్తి చేయాలి..

### జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్ 21 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) :జనగణన - 2027ను సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లు బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, డిస్ట్రిక్ట్ అండ్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.జనగణన 2027 లో భాగంగా హౌస్ లిస్టింగ్ బ్లాక్స్, సెన్సస్ మానిటరింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ డిజిటల్ విధానం, స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) పై సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చివరి రోజు శిక్షణ కొనసాగుతుండగా, మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. జన గణనకు సంబంధించిన కిట్లను సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ మొదటి దశలో మే 11 వ తేదీ నుంచి జూన్ 09 వ తేదీ వరకు ఇండ్ల గణన నిర్వహిస్తారని, రెండో దశ ఫిబ్రవరి 2027 లో వ్యక్తుల వారిగా సమాచారం సేకరిస్తారని అధికారులు తెలిపారు. ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా సేకరించి నమోదు చేయాలని ఆదేశించారు. అందరి వివరాలు గోప్యంగా ఉంచాలని స్పష్టం చేశారు.ఎండాకాలం నేపథ్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్ వెంట తీసుకువెళ్లాలని సూచించారు. ఈ నెల 26 వ తేదీన స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా చేసుకోవాలని ఆదేశించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బాధ్యతల నిర్వహణలో ఎంతో కీలకమని, వివరాలు పక్కాగా సేకరించి నమోదు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి,ఛార్జ్ అధికారులు మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, మహేష్ కుమార్, ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయ భరోసా అమలు చేయాలి

### వ్యకాస నేత నాగేశ్వరరావు డిమాండ్

కారేపల్లి, : భూమిలేని పేదలకు అండగా నిలుస్తామని హామీలు ఇచ్చిన ప్రభుత్వాలు ఆచరణలో విఫలమవుతున్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. మంగళవారం సింగరేణి మండలంలోని ఉపాధి హామీ పని ప్రదేశాలను సందర్శించిన వ్యకాస బృందం, కూలీల పరిస్థితులను సమీక్షిస్తూ విస్తృత స్థాయిలో సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను స్వయంగా తెలుసుకున్న ఆయన, ప్రభుత్వాల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల ముందు భూమిలేని సుమారు 22 లక్షల వ్యవసాయ కూలీలకు “ఇందిరమ్మ ఆత్మీయ భరోసా” అమలు చేస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర నాయకత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను పూర్తిగా విస్మరించింద న్నారు. ఏడాది గడిచినా అరకొర అమలు మాత్రమే జరగడం పేదలలో తీవ్ర నిరాశను కలిగించిందని అన్నారు. ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉన్న వేలాది కుటుంబాలు ఇప్పటికీ ఆశలకే పరిమితమయ్యాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త విధానాల వల్ల గ్రామీణ పేదల జీవనోపాధి దెబ్బతింటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా “వీబీజీ రాంజీ” అమలు కారణంగా ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయని, ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతోందని విమర్శించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలులో కేంద్రం నిధులను క్రమంగా తగ్గిస్తూ వస్తోందని, ప్రస్తుతం 60 శాతం మాత్రమే విడుదల చేసి మిగిలిన 40 శాతం రాష్ట్రంపై భారం మోపడం అన్యాయమని అన్నారు. యూపీఏ-1 ప్రభుత్వం 2005లో ప్రవేశపెట్టిన ఉపాధి హామీ చట్టం లక్ష్యాలను పక్కదారి పట్టించే విధంగా మార్పులు చేయ డం సరికాదని ఆయన పేర్కొన్నారు. పేదల జీవనోపాధికి కీలకమైన ఈ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, మండుతున్న ఎండల కారణంగా ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్వేలో బయటపడింది. పని ప్రదేశాల్లో తగిన సదుపాయాలు లేకపోవడం, తాగునీరు, నీడ కోసం టెంట్లు, ప్రాథమిక వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. రోజుకు రెండుసార్లు ఫోటోలు తీసే విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, అది కార్మికులకు అనవసరమైన భారం అవుతోందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల బిల్లులను తక్షణమే విడుదల చేయాలని, పనికి వచ్చే ప్రతి కూలీకి కనీస వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని నాగేశ్వరరావు స్పష్టం చేశారు. వ్యకాస సంస్థ చేపట్టిన ఈ సర్వేలో గుర్తించిన సమస్య లను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ సర్వే కార్యక్రమంలో వ్యకాస మండల అధ్యక్షుడు యనమనగండ్ల రవి, కార్యదర్శి కేసగాని ఉపేందర్, నాయకులు పాసిని నాగేశ్వరరావు, చల్లా మల్లమ్మ, షేక్ సైదులు, కరపటి అరుణ, మద్దెల నాగయ్య, అన్నారపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ కార్మికుల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే ఈ సర్వేకు స్థానికులు మద్దతు తెలిపారు.

## వంటగదికి దూరంగా రానా సతీమణి..

# అత్తమ్మ వంటపై ఆసక్తికర వ్యాఖ్యలు వైరల్!



స్టార్ హీరోల వ్యక్తిగత జీవితాలపై ప్రేక్షకుల్లో ఎప్పుడూ ప్రత్యేక ఆసక్తి ఉంటుంది. ముఖ్యంగా వారి కుటుంబ జీవితం, రోజువారీ అలవాట్లు, ఇంటి సంస్కృతి వంటి విషయాలు బయటకు వస్తే అవి వెంటనే చర్చనీయాంశంగా మారిపోతాయి. తాజాగా హీరో రానా దగ్గుపాటి భార్య మిహికా బజాజ్ గురించి వెలుగులోకి వచ్చిన కొన్ని ఆసక్తికర విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వ్యాపార కుటుంబానికి చెందిన మిహీక బజాజ్ ఓ సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్. ఆమె నిర్వహిస్తున్న అనే ఈవెంట్ మేనేజ్‌మెంట్ మరియు డెకర్ సంస్థ ద్వారా మంచి గుర్తింపు సంపాదించారు. క్రియేటివిటీ, బిజినెస్ మైండ్‌తో ఆమె తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరుచుకున్నారు. అయితే ప్రొఫెషనల్‌గా ఎంత బిజీగా ఉన్నప్పటికీ, వ్యక్తిగత జీవితంలో మాత్రం చాలా సింపుల్‌గా ఉండటం ఆమె ప్రత్యేకత. ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మిహీక తన వ్యక్తిగత జీవితంపై ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. పెళ్లికి ముందు అప్పుడప్పుడు వంట చేసేదాన్నని చెప్పిన ఆమె, పెళ్లి తర్వాత మాత్రం కిచెన్ వైపు వెళ్లాల్సిన అవసరం రాలేదని నవ్వుతూ వెల్లడించారు. దీనికి కారణం తన అత్తమ్మ వంట ప్రతిభ అని పేర్కొన్నారు. "అమ్మ చాలా బాగా వంట చేస్తారు" అని చెప్పిన ఆమె, అత్తమ్మను 'అమ్మ' అని పిలుస్తానని చెప్పడం అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ వ్యాఖ్యలు చూస్తే ఆమెకు అత్తమామలతో ఉన్న అనుబంధం ఎంత బలంగా ఉందో స్పష్టమవుతోంది. ఇంకా వంటల విషయానికి వస్తే, తన అత్తమ్మ చేసిన మటన్ కర్రీ తనకు ఎంతో ఇష్టమని మిహీక తెలిపారు. తన జీవితంలో అంత రుచిగా మటన్ ఎప్పుడూ తినలేదని చెప్పడం విశేషం. సాధారణంగా సెలబ్రిటీలు ఫిట్‌నెస్, డైట్‌లపై దృష్టి పెట్టే ఈ కాలంలో, ఇలాంటి హోమ్ ఫుడ్‌పై ఆమె చూపిన ప్రేమ అభిమానుల్లో ఆసక్తి కలిగిస్తోంది. గ్లామర్ ప్రపంచంలో ఉన్నప్పటికీ, కుటుంబ విలువలు, అనుబంధాలకు ప్రాధాన్యం ఇస్తున్న జంటగా రానా–మిహీక నిలుస్తున్నారు. వారి దాంపత్య జీవితం కేవలం స్టార్‌డమ్‌కే పరిమితం కాకుండా, సాదాసీదా కుటుంబ జీవనశైలిని ప్రతిబింబిస్తోందని చెప్పాలి.

# కేసీఆర్‌ని పొగుడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మధుప్రియ సంచలన వ్యాఖ్యలు..



తెలంగాణ జానపద గీతాలకు ప్రాణం పోసిన గాయని మధుప్రియ మరోసారి వార్తల్లో నిలిచారు. ఈసారి తన పాటలతో కాదు, రాజకీయ వ్యాఖ్యలతో చర్చనీయాంశంగా మారారు. జగిత్యాలలో నిర్వహించిన బీఆర్ఎస్ బహిరంగ సభలో పాల్గొన్న ఆమె మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తన అభిమానాన్ని వ్యక్తం చేస్తూనే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. జగిత్యాలలో జరిగిన 'కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ'లో మధుప్రియ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సభకు హాజరైన వేలాది మంది ప్రజలను ఆమె తన జానపద గీతాలతో ఉర్రూతలూగించారు. ముఖ్యంగా కేసీఆర్ నాయకత్వాన్ని కీర్తిస్తూ "మళ్లీ బాపు రావాలి.. మళ్లీ కేసీఆర్ పాలన రావాలి" అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు సభలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.సభ అనంతరం మీడియాతో మాట్లాడిన మధుప్రియ, "ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా తెలంగాణ ప్రజలకు కేసీఆర్ అంటే ఒక ఎమోషన్. రాష్ట్ర సాధనలో ఆయన పోషించిన పాత్రను ఎవరూ చెరిపివేయలేరు" అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి కేసీఆర్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. ఇక ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. "కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రైతుల సమస్యలు పెరిగాయి. కూల్చివేతలు ఎక్కువయ్యాయి. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే తెలంగాణ బాగుంది. అందుకే మళ్లీ ఆయనే అధికారంలోకి రావాలి" అని ఆమె అభిప్రాయపడ్డారు. అలాగే "నేను ఎప్పుడూ కేసీఆర్ పక్షమే ఉంటాను. రేవంత్ రెడ్డి అడిగినా కూడా నేను వారి కోసం పాటలు పాడను" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మధుప్రియ ప్రస్థానం విషయానికి వస్తే, పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ఆమె చిన్న వయసులోనే జానపద గీతాలతో మంచి గుర్తింపు సంపాదించారు. 'ఆడపిల్లనమ్మ నేను ఆడపిల్లనాని' పాటతో తెలుగు రాష్ట్రాల్లో ఓవర్‌నైట్ స్టార్‌గా మారారు. ప్రజాకళాకారుడు గద్దర్‌తో వేదికలు పంచుకోవడం ఆమెకు మరింత గుర్తింపునిచ్చింది.

తరువాత సినీరంగంలోకి అడుగుపెట్టి పలు సూపర్ హిట్ పాటలతో తన ప్రతిభను చాటుకున్నారు. ముఖ్యంగా 'వచ్చిండే' పాటతో ఆమె కెరీర్‌కు కీలక మలుపు వచ్చింది. ఆ తర్వాత అనేక సినిమాల్లో పాటలు పాడుతూ తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. అలాగే బిగ్ బాస్ సీజన్-1లో పాల్గొని ప్రేక్షకులను అలరించారు. ఇటీవల కాళేశ్వర ఆలయంలో పాట చిత్రీకరణ వివాదంతో కూడా వార్తల్లో నిలిచిన ఆమె, ఇప్పుడు రాజకీయ వ్యాఖ్యలతో మరోసారి హాట్ టాపిక్‌గా మారారు.

# నటనలో దిట్ట.. సంస్కారంలో సున్నా

## ప్రకాశ్ రాజ్‌పై నటుడు నాగ మహేశ్ విమర్శనాస్త్రాలు

వెండితెరపై నవరసాలను పండించే ప్రకాశ్ రాజ్, నిజ జీవితంలో మాత్రం కేవలం 'విద్వేషం' అనే రసాన్నే నమ్ముకున్నారని నటుడు నాగ మహేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "జస్ట్ ఆస్కింగ్" అంటూ ప్రశ్నించే నెపంతో ఆయన హిందూ ధర్మాన్ని, కోట్లాది మంది ఆరాధ్య దైవమైన శ్రీరాముడిని కించపరచడం హేయమని మండిపడ్డారు. ప్రకాశ్ రాజ్ తన తల్లి నమ్మకాన్ని గౌరవిస్తూ చర్చికి వెళ్లినప్పుడు అందరూ ఆయన్ని సంస్కారవంతుడిగా చూశారని, కానీ అదే వ్యక్తి శ్రీరాముడిని అవహేళన చేసినప్పుడు ఆయనలోని సంకుచిత బుద్ధి బయటపడిందని వ్యాఖ్యానించారు. నాస్తికత్వం అంటే దేవుడిని నమ్మకపోవడం మాత్రమే కానీ... ఇతరుల నమ్మకాలను కించపరచడం కాదని హితవు పలికారు. లక్ష్మణుడిని రాముడు 'లక్కీ' అని పిలుస్తాడని, రావణుడి తోటలో పండ్లు దొంగిలించారని, దానికి శూర్పణఖ జీఎస్టీతో బిల్లు వేసిందంటూ ప్రకాశ్ రాజ్ చేసిన వెకిలి వ్యాఖ్యలు ఆయన ఉన్మాదానికి పరాకాష్ఠ అని ఎండగట్టారు. రాముడు ఉత్తరాది వాడని, రావణుడు దక్షిణాది వాడని ప్రకాశ్ రాజ్ చేస్తున్న ప్రచారం ప్రాంతీయ విద్వేషాలను రగిల్చే కుటిల ప్రయత్నం అని విమర్శించారు. ప్రధాని మోదీ, బీజేపీపై ఉన్న వ్యక్తిగత వ్యతిరేకతను



ప్రకాశ్ రాజ్ ఒక మతంపై ద్వేషంగా మార్చుకుంటున్నారని, ఇది ఆయన వినాశనానికే దారితీస్తుందని నాగ మహేశ్ హెచ్చరించారు.




# ప్రియుడి దర్శకత్వంలో సినిమా?



సినిమాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉంటుంది అగ్ర కథానాయిక శ్రద్ధాకపూర్. వైవిధ్యమైన కథాంశాలను ఎంచుకుంటూ పాత్రల పరంగా కొత్తదనానికి అధిక ప్రాధాన్యతనిస్తుంది. ప్రస్తుతం ఆమె మహారాష్ట్ర నృత్య కళాకారిణి విఠాబాయి బయోపిక్ 'ఈతా'లో నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ భామ హిందీలో మరో భారీ ప్రాజెక్ట్‌ను అంగీకరించింది. అమీర్‌ఖాన్ హీరోగా నటించే ఈ చిత్రాన్ని భారత్ పే మనీ రూపకర్త అశ్నీర్ గ్రోవర్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కించబోతున్నారు. విశేషమేమిటంటే.. శ్రద్ధాకపూర్ ప్రియుడిగా ప్రచారంలో ఉన్న ప్రముఖ దర్శకుడు, రచయిత రాహుల్ మోడీ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఈ చిత్రానికి దర్శకత్వంతో పాటు నిర్మాణ బాధ్యతల్ని కూడా రాహుల్ మోడీ తీసుకున్నారు. శ్రద్ధాకపూర్ కథానాయికగా నటించిన 'తూ ఝూతీ మే మక్కర్' చిత్రానికి రాహుల్ మోడీ రచయితగా పనిచేశారు. ఆ సినిమా షూటింగ్ సమయంలో ఏర్పడిన పరిచయం క్రమంగా ప్రేమగా మారిందని తెలిసింది. గత రెండేళ్లుగా రాహుల్ మోడీతో శ్రద్ధాకపూర్ ప్రేమలో ఉందని బాలీవుడ్ టాక్. ప్రియుడి దర్శకత్వంలో సినిమా కావడంతో శ్రద్ధాకపూర్ ఈ సినిమాకు వెంటనే అంగీకరించిందని సమాచారం. త్వరలో ఈ చిత్రం సెట్స్‌మీదకు వెళ్లనుంది.

# ఆ వివాదంపై క్లారిటీ ఇచ్చిన సాయి పల్లవి..



తెలుగు, తమిళ సినీ ఇండస్ట్రీల్లో స్టార్ హీరోయిన్‌గా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న సాయి పల్లవి ప్రస్తుతం బాలీవుడ్‌లో కూడా తన సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది. ప్రతిష్టాత్మకమైన రామాయణ సినిమాలో సీత పాత్రలో నటిస్తూ బిజీగా ఉన్న ఆమె, తాజాగా నాలుగేళ్ల క్రితం జరిగిన ఒక సంఘటనను గుర్తుచేసుకుంటూ ఆసక్తికర విషయాలు వెల్లడించారు. సాయి పల్లవి మాట్లాడుతూ... సుమారు నాలుగేళ్ల క్రితం తాను ఒక ప్రెస్ మీట్‌లో పాల్గొన్న సందర్భాన్ని వివరించారు. ఆ సమయంలో ఒక రిపోర్టర్ "మీ మలయాళ నటీనటులు తమిళం ఇంత బాగా ఎలా మాట్లాడతారు?" అని ప్రశ్నించారని చెప్పారు. దానికి తాను "నేను తమిళ అమ్మాయిని, మలయాళీని కాదు" అని నిజం చెప్పానని తెలిపారు. అయితే ఆ సమాధానం తర్వాత పరిస్థితులు ఎలా మారాయో చెప్పుకుంటూ సాయి పల్లవి బాధ వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాల తర్వాత ఒక పత్రికలో "మలయాళీ అని పిలిచినందుకు సాయి పల్లవికి కోపం వచ్చింది" అనే హెడ్‌లైన్ చూసి తాను షాక్‌కు గురయ్యానన్నారు. తన మాటలను పూర్తిగా తప్పుగా అర్థం చేసుకుని ప్రచారం చేయడం బాధ కలిగించిందని వెల్లడించారు. మరో సందర్భాన్ని కూడా ఆమె గుర్తు చేసుకున్నారు. ఎయిర్‌పోర్ట్‌లో ఒక మహిళ తనతో మలయాళంలో మాట్లాడిన తర్వాత మీకు కోపం వస్తుందేమో" అని చెప్పడంతో తాను ఆశ్చర్యపోయానన్నారు. వెంటనే "నాకు అలాంటి భావం ఎప్పుడూ లేదు అని చెప్పినా, ఆమె నమ్మలేదని తెలిపారు. ఈ సంఘటనలు తనను చాలా బాధపెట్టాయని, తాను చెప్పని విషయాలు తనపై మోపడం సరైంది కాదని అన్నారు. భాషల విషయానికి వస్తే తాను ఎప్పుడూ ఎలాంటి బేధాలు చూపనని సాయి పల్లవి స్పష్టం చేశారు. నా మాతృభాష తమిళం అని మాత్రమే చెప్పాను.

దానిని తప్పుగా అర్థం చేసుకున్నారు. నేను ఎప్పుడూ ఏ భాషనూ చిన్నచూపు చూడను అని క్లారిటీ ఇచ్చారు. అలాగే తాను తమిళనాడులోని కోయంబత్తూరులో పుట్టి పెరిగిన విషయాన్ని గుర్తు చేశారు. అందుకే తన మాతృభాష తమిళమని చెప్పానని, అంతేకాని ఇతర భాషలను తిరస్కరించే ఉద్దేశం ఎప్పుడూ లేదని తెలిపారు. ప్రస్తుతం సాయి పల్లవి చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆమె ఇచ్చిన వివరణతో గతంలో వచ్చిన వివాదానికి పూర్తి స్థాయిలో క్లారిటీ వచ్చిందని అభిమానులు భావిస్తున్నారు.

# బాలయ్య సినిమా నుండి నయనతార ఔట్ కాజల్ ఎంట్రీకి రంగం సిద్ధం?

నందమూరి నటసింహం బాలకృష్ణ ప్రస్తుతం తన కెరీర్‌లో గోల్డెన్ ఫేజ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. అఖండ , వీరసింహారెడ్డి , భగవంత్ కేసరి వంటి వరుస విజయాలతో ఆయన స్టార్‌డమ్ మరింత పెరిగింది. ఈ వయసులో కూడా యంగ్ హీరోలకు పోటీగా వరుస సినిమాలను లైన్‌లో పెట్టడం బాలయ్య ప్రత్యేకతగా మారింది. ఇలాంటి సమయంలోనే మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేనితో బాలకృష్ణ మరోసారి జతకట్టడం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన "వీరసింహారెడ్డి" భారీ విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే జోష్‌తో NBK 111" పేరుతో మరో ప్రాజెక్ట్ తెరకెక్కుతోంది. ఈ చిత్రం పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్. 1960-70ల కాలంలోని ముంబై నేపథ్యంతో పాటు చారిత్రక అంశాలను మేళవిస్తూ దర్శకుడు పవర్‌ఫుల్ స్క్రిప్ట్ సిద్ధం చేశారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు తమన్ మరోసారి బాలయ్య సినిమాకు సంగీతం అందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ సినిమాలో హీరోయిన్ ఎంపిక ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మొదట లేడీ సూపర్ స్టార్ నయనతారను ఈ ప్రాజెక్ట్ కోసం ఎంపిక చేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే స్క్రిప్ట్ మార్పులు, కాల్‌షీట్ సమస్యల కారణంగా ఆమె ఈ సినిమా నుంచి తప్పుకున్నట్లు టాక్ వినిపిస్తోంది.

# మొక్కజొన్న కొనుగోలులో ఆంక్షలు ఎత్తివేయాలి



**ఎకరాకు 26 క్వింటాళ్ల నిబంధనతో అన్యాయం**
**బస్తాల కొరత, లారీల రాకలో జాప్యం**
**అకాల వర్షాల ముప్పు.. తక్షణమే ఎగుమతులు చేపట్టాలి**
**సొంత నియోజకవర్గ రైతుల సమస్యలపై డిప్యూటీ సీఎం స్పందించాలి**
**తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు**
**ఖమ్మం - బోనకల్ రహదారిపై రైతులతో కలిసి రాస్తారోకో**

చింతకాని: ప్రభుత్వం రైతులు పండించిన మొక్కజొన్నను ఎలాంటి నిబంధనలు లేకుండా పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం-బోనకల్ ప్రధాన రహదారిపై నాగులవంచ వద్ద తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ ఆందోళనతో రహదారిపై రాకపోకలు స్తంభించాయి. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పుకుంటోందే తప్ప, క్షేత్రస్థాయిలో రైతుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కేవలం మొక్కుబడిగా కేంద్రాలను తెరిచి రైతులకు నరకం చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నిబంధనల పేరుతో వేధింపులు: ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో ఎకరాకు కేవలం 26 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, కానీ రైతులు ఎకరాకు 40 నుంచి 50 క్వింటాళ్ల దిగుబడి సాధించారని గోపాలరావు వివరించారు. ప్రభుత్వం విధించిన ఈ నిబంధన వల్ల మిగిలిన సగం పంటను రైతులు ఎక్కడ అమ్ముకోవాలని ఆయన ప్రశ్నించారు. ఈ నిబంధనను వెంటనే ఎత్తివేసి పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కొనుగోలు కేంద్రాల వద్ద బస్తాల కొరత తీవ్రంగా ఉందని, రైతులు తమ సొంత డబ్బులతో బస్తాలు కొనుక్కుంటున్నారని, ఇది వారిపై అదనపు భారం మోపడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అకాల వర్షాల భయం.. అధికారుల జాప్యం: కాటా వేసిన మొక్కజొన్నలను తరలించడానికి లారీలు రావడం లేదని, దీనివల్ల 15 నుంచి 20 రోజులుగా పంట కల్లాల్లోనే మగ్గిపోతోందని రైతులు వాపోయారు. అధికారులను అడిగితే లారీలు దొరకడం లేదని సాకులు చెబుతున్నారని విమర్శించారు. ప్రస్తుత అకాల వర్షాల నేపథ్యంలో పంట తడిసిపోతే రైతులకు భారీ నష్టం వాటిల్లుతుందని, వెంటనే లారీలు తెప్పించి ఎగుమతులు చేపట్టాలని కోరారు. మధిర నియోజకవర్గంలోనే అత్యధికంగా సుమారు లక్షన్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగైందని, ఇక్కడి ఎమ్మెల్యే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన సొంత నియోజకవర్గ రైతుల సమస్యలపై స్పందించకపోవడం దారుణమన్నారు.

పోరాటం ఉధృతం చేస్తాం: డిప్యూటీ సీఎం వెంటనే జోక్యం చేసుకుని మార్క్‌ఫెడ్ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని, లేనిపక్షంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు తోటకూర వెంకట నరసయ్య, మండల నాయకులు ఆలేటి రవి, బల్లి చిన్న వీరయ్య, మడిపల్లి కిరణ్ బాబు, ఆళ్ల మాధవరావు, రౌతు అప్పారావు, బండి నరేష్, ఓబన బోయిన అచ్చయ్య, గడ్డం కోటేశ్వరరావు, కూచిపూడి బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

## నిమ్మలగూడెం పాఠశాలలో రూ 1 లక్ష విలువైన విద్యా సామాగ్రి పంపిణీ



దుమ్ముగూడెం, ఏప్రిల్ 21(న్యూస్) : దుమ్ముగూడెం మండలం జీపీఎస్ నిమ్మలగూడెం పాఠశాలలో భోగ లక్ష్మీనారాయణ రెడ్డి శిష్యుడు కుమార్ ఆధ్వర్యంలో లక్ష రూపాయల విలువైన విద్యా సామాగ్రి పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్మార్ట్ టీవీ, పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, షూస్, టేబుళ్లు, కుర్చీలు, వాటర్ బాటిళ్లు, స్పోర్ట్స్ డ్రెస్సులు, రైస్ ప్లేట్లు, గ్లాసులు తదితర అవసరమైన వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా భోగ లక్ష్మీనారాయణ రెడ్డి మాట్లాడుతూ, విద్య ప్రతి మనిషి జీవితాన్ని వెలిగించే దీపమని పేర్కొన్నారు. పేదరికం, ఇబ్బందులు ఉన్నా విద్య ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. చదువు ద్వారానే సమాజంలో గౌరవం, మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని తెలిపారు. సింగావరం సర్పంచ్ నూప నాగలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులు, గురువులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తు కోసం తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీ రవి, ఉపాధ్యాయులు రుక్మిణి, నూప సీతయ్య, వార్డు సభ్యుడు రాం చిట్టి, గ్రామ పెద్దలు శేఖర్, హరి, శివ, రాజు, రాంబాబు, నరేందర్, సాయి, అలాగే విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## అడగంటుతున్న.. భూ గర్భజలాలు



కరీంనగర్, ఏప్రిల్ 21,: వేసవిలో ఎండల తీవ్రత అంతకంతకు పెరుగుతుండగా, కరీంనగర్ జిల్లాలోని నీటివనరులన్నీ నిండుకున్నాయి. వాగులు, వంకలు, చెరువులు, కుంటలు అడుగంటి ఒండ్రు మట్టి తేలితున్నాయి. జిల్లా పరిధిలోని చిన్న, మధ్య తరహా, భారీ ప్రాజెక్టుల్లో కూడా నీటి నిల్వలు అదిగంటుతున్నాయి. ఉక్కపోత, భరించలేని వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కూడా నీటిని అదే స్థాయిలో వినియోగిస్తున్నారు. ఈ ప్రభావం భూగర్భ జలాలపై పడుతోంది. చివరి దశలో ఉన్న పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు అరిగోస పడుతున్నా రు. తమ స్థిరాస్తులు, ఆభరణాలు తనాఖా పెడుతూ, అట్టడుగుకు చేరిన నీటిని పైకి తె చ్చేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. నీటిమట్టంపై జిల్లా భూగర్భ జలవనరుల శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం ఈ ఏడాది మార్చిలో 8.10 మీటర్లు, ఏప్రిల్ లో 9.02 మీటర్ల సగటు నీటిమట్టం నమోదైంది. గత ఏడాది వేసవిలో కూడా ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన భారీ వర్షాలతో భూగర్భ జలమట్టంలో మార్పు వచ్చి, కొంతమేర ఉపశమనం కలిగింది. అనంతరం అసలు రెయినీ సీజన్లోనే వర్షాలు ముఖం చాటేయగా, ఎప్పటికప్పుడు భూగర్భజలాలు పాతాళానికి పడిపోతున్నా యి. అడపాదడపా వర్షాలు కురిసినా వాటి తో భూగర్భజలాలు పెరగలేదని భూగర్భ జల వనరుల శాఖ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో వేసవి తీవ్రతతో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వరి పంట కు సరిపడా నీరు అందకపోవడంతో పం టలు ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తూ బావుల్లో పేరుకుపోయిన మట్టిని క్రేన్ల సహాయంతో తొలగిస్తున్నారు. నీటి నిల్వలు పెరగాలని ఆశిస్తూ పెద్ద మొ త్తంలో ఖర్చు పెట్టి బావులను శుభ్రం చేస్తున్నారు. అంతేకాకుండా, మరింత నీరు అం దుబాటులోకి రావాలనే ఉద్దేశంతో బావుల పక్కనే సైడ్ బోర్లు కూడా వేయిస్తున్నారు. కరీంనగర్ ఎల్ఎండీ సామర్థ్యం 24.034 టి ఎంసీలు కాగా జలాశయంలో నీటి నిల్వలు 6.9 టీఎంసీలకు పడిపోవడంతో నగరంలో నీటి కష్టాలు మొదలయ్యాయి. గతంలో ప్రతిరోజూ 55 ఎంఎల్డీల నీటిని సరఫరా చేసిన నగరపాలక సంస్థ, రెండు రోజులకు ఒకసారి సరఫరా చేసేందుకు సిద్ధం అవుతుంది ఎంఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృథా చేయవద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. మిడ్ మానేరు నుంచి ప్రస్తుతం 500 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు.

## డయల్ 100 కు వచ్చే ప్రతి కాల్ పై వేగంగా స్పందించి, సరైన పరిష్కారం చూపాలి

### జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



ఆదిలాబాద్, ఏప్రిల్ : 21 ( తెలంగాణ వాణి ప్రతినిధి ): పట్టణంలోని మావల పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి ఆసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మావల పోలీస్ స్టేషన్లో ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ, సిబ్బంది విధులను, పోలీస్ స్టేషన్కు వచ్చి బాధితుల పట్ల వ్యవహరిస్తున్న తీరును పరిశీలించారు. మొదటగా పోలీస్ స్టేషన్లో ఉన్న వాహనాలను పరిశీలించి, వాటి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, నేరస్తులు దొంగతనాలు చేసి వాహనాల యొక్క చేసేస్ నంబర్ను చెరిపివేసి వినియోగిస్తారని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా స్వంతంగా సమాచార వ్యవస్థను, నిఘా వ్యవస్థను, అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా వార్డు పోలీస్ ఆఫీసర్ల ద్వారా ఎంక్వైరీ జరిగేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ముఖ్యంగా పలు కేసులలో బెయిల్ పై ఉంటూ, పోలీస్ స్టేషన్కు హాజరుకు రాని వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని, సక్రమంగా రాని వారి బెయిల్ రద్దుకై సిఫార్సు చేయాలని తెలిపారు. రిసెప్షన్ సెంటర్ నందు ఉన్న రికార్డులను పరిశీలించారు, బాధితుల సమస్యలపై సరైన దర్యాప్తు చేసి సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. డయల్ హండ్రెడ్ ద్వారా వచ్చే ప్రతి ఒక్క కాల్ కి వెంటనే స్పందించి నిమిషాల వ్యవధిలో సంఘటనా స్థలాలకు చేరుకొని, బాధితులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రయత్నించాలని, సమస్యలను పరిష్కరించేలా చర్యలను చేపట్టాలని తెలిపారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు తెలియజేసి సమస్య పెద్దది కాకుండా, సమయస్ఫూర్తితో వ్యవహరించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో ఉన్న రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఉండాలని ఎలాంటి పెండెన్సీ లేకుండా ఉండాలని తెలిపారు. రాత్రి సమయాల్లో మరియు మధ్యాహ్నం సమయాలలో దొంగతనాలు జరగకుండా గస్తీ నిర్వహిస్తూ ఉండాలని సూచించారు.

ప్రజలకు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా పోలీసు మీకోసం కార్యక్రమాలను నిర్వహిస్తూ అవగాహన కల్పించాలని, సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మావల ఎస్ హెచ్ ఓ రాహుల్ కాంత్ , సిఐ కర్ర స్వామి,ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే.. ప్రజా దర్బార్ కార్యక్రమం



**దశలవారీగా అన్ని గ్రామాల్లో ఏర్పాటు**
**మల్లూరు, మంగపేట ప్రజా దర్బార్ కార్యక్రమంలో వినతుల వెల్లువ**
**మహిళా సాధికారతే ప్రజా ప్రభుత్వ లక్ష్యం**
**-మహిళా సంఘాలకు 60వేల కోట్ల వడ్డీ లేని రుణాలు**
**గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై కఠిన చర్యలు**
**రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి సీతక్క**

ములుగు, ఏప్రిల్21 (తెలంగాణ వాణి)ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని,దశలవారీగా అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని మంత్రి సీతక్క వెల్లడించారు. మల్లూరు, మంగపేటలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు విశేష స్పందన లభించిందన్నారు.

మహిళా సాధికారతే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని,మహిళా సంఘాలకు 60 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశామని, గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి స్పష్టం చేశారు.

మంగళవారం మంగపేట మండలం మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి వారిని మంత్రి సీతక్క దర్శించుకున్నారు. ప్రత్యేక ప్రజా దర్బార్ లో చుంచుపల్లి,కొత్త మల్లూరు, మల్లూరు, నరసింహ సాగర్, శనగకుంట ఆవాసం, పూరేడుపల్లి గ్రామాల ప్రజల నుంచి మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. కలిసి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం మంగపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో మంగపేట,కమలాపూర్, బోర్ నర్సాపూర్, కోమటిపల్లి, కొత్తూరు, మోట్లగూడెం, తొండ్యాల లక్ష్మీపురం గ్రామాల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. స్థానిక గ్రామాల్లోని సమస్యలు, అవసరమైన అభివృద్ధి పనులు, ప్రభుత్వం విడుదల చేసిన నిధుల వినియోగ వివరాలను మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర టి.ఎస్. సంబంధిత పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సభలను సక్రమంగా నిర్వహించి, గ్రామ ప్రజలకు అవసరమైన, అందరికీ ఉపయోగపడే అభివృద్ధి పనులకు మాత్రమే నిధులను వినియోగించాలని, గ్రామ సభ అనుమతి లేకుండా నిధులను దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవని మంత్రి సీతక్క అధికారులను హెచ్చరించారు.

## గ్రామం మధ్యలోనే ప్రభుత్వ శాఖల భవనాలు ఉండేలా చూసుకోవాలి

### పంచాయతీరాజ్ రోడ్లు భవనాల అభివృద్ధి పై సమీక్షలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



నాంపల్లి:ఏప్రిల్ 21 ( తెలంగాణ వాణి ప్రతినిధి):మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 161 గ్రామపంచాయతీలలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించే గ్రామపంచాయతీ భవనాలు అంగన్వాడి భవనాలు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల భవనాల స్థితి ఎలా ఉంది. ఎక్కడెక్కడ నూతన భవనాలు నిర్మించాలి, నిర్మాణంలో ఉన్న భవనాల ప్రగతి, ఇటీవల నూతనంగా మంజూరైన పంచాయతీ రాజ్ రోడ్ల నిర్మాణం ఎలా ఉండాలనే దానిపై మునుగోడు లోని క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గ్రామపంచాయతీల భవనాలను ఆయా జనాభాలను బట్టి గ్రేడ్లుగా విభజించి అంచనాలు రూపొందించా లన్నారు. ప్రతి మండల హెడ్ క్వార్టర్‌లో ఉన్నగ్రామపంచాయతీ భవనాలను మునుగోడు క్యాంపు కార్యాలయం మాదిరి గా ఉండేలా అభివృద్ధి చేయాలన్నారు. రాబోయే కాలంలో జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఈ గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలు ఉండాలని సూచించారు. గ్రామపంచాయతీ భవనాలు, అంగన్వాడీ భవనాలు, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవనాలు గ్రామ మధ్యలో ప్రజలకుఅందుబాటులోఉండే విధంగాప్రదేశాలను ఎంపిక చేసి ఆతర్వాతే నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఒకవేళ గ్రామం మధ్యలో స్థలం దొరకని సందర్భంలో అవసరమైతే అందుబాటులో ఉన్న స్థలాన్ని కొనుగోలు చేసైన భవనాలను నిర్మించాలన్నారు. మునుగోడు నియోజకవర్గంలోమంజూరైన58 పంచాయతీ రాజ్ శాఖ రోడ్ల పనుల్లో స్థానికులను భాగస్వామ్యం చేస్తూ ప్రమాదపు మూలమలుపులు లేకుండా నేరుగా నాణ్యత గా ఉండేలా నిర్మాణాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం నుండి నిధులు తీసుకొచ్చే బాధ్యత నాదని నిర్మాణాలు నాణ్యతగా ప్రజలకు అవసరం వచ్చే విధంగా చూసే బాధ్యత మీదని వీలైనంత తొందరగా అన్ని పనులకు అంచనాలు రూపొందించి నివేదిక ఇవ్వాలని అధికారులను కోరారు. ఈ సమీక్ష సమావేశంలో నల్గొండ పంచాయతీ రాజ్ శాఖ ఈఈ గిరిధర్, డిఇ భాలుచందర్, డి ఈ నాగేశ్వరరావు, ఏఈలు పాల్గొన్నారు.

## వడదెబ్బతో.. వ్యక్తి మృతి

మందమర్రి : మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ శాంతినగర్ కు చెందిన బండారి రాజేష్ గౌడ్ అనే వ్యక్తి తో వడదెబ్బతో సోమవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీ వంశీకృష్ణ మంగళవారం వేకువ జామున మృతిడి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తమ వంతు సహాయ, సహ కారాలు ఉంటాయని ఓదార్చారు. మృతుడు రాజేష్ గౌడ్ స్వయంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్ మేనల్లుడు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పిన్నింటీ రఘునాథ్ రెడ్డి, ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సొత్కు సుదర్శన్, కాంగ్రెస్ నాయకులు ఓడ్నాల శ్రీనివాస్, బండి సదానందంలు కుటుంబ సభ్యులను ఓదార్చారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar
MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com